నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
గురువారం | 5 డిసెంబర్ 2024 | www.navatelangana.com

శ్రీ సాయి వెంకటేశ్వర హాస్పిటల్ ప్రారంభోత్సవంలో మంత్రి



నవతెలంగాణ-జోగిపేట

జోగుపేట పట్టణంలోని శ్రీసాయి వెంకటేశ్వర హాస్పిటల్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహిపాల్ (డిఎస్ వైయస్, పీజీ డీఈఎం) మంత్రిని శాలువాతో సన్మాని ంచారు. ఆసుపత్రిని కలియ తిరుగుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు. ఆస్పత్రి మంచి సేవలను అందిస్తూ గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగుపేట 17వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు, రిటైర్డ్ హెచ్ఎం డి.భూమయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, కాంట్రాక్టర్ సురోత్తం రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ ఈ. బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంపులను సీజ్ చేసిన తహశీల్దార్

అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు తహసీల్దార్ ముసాదిక్



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 13 ఇసుక డంపులను బుధవారం తహశీల్దార్ ముసాదిక్ సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ ఇసుక సుమారు 200 ట్రాక్టర్లు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాం.... అమలు చేస్తున్నాం



- హుస్నాబాద్ అభివృద్ధి చేసి చూపుతా
- ప్రజలు అందరు సంతోషంగా ఉండాలి
- పని చేసే వారికి పదవులు
- చౌటపల్లి రైతులకు అన్యాయం చేయం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారంటీల హామీ ఇచ్చామని ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులూ రావద్దని, ప్రజా సంక్షేమంలో లోటు లేకుండా చూడాలని ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో పాడి పంటలతో ఉద్యోగ అవకాశాలతో బాగుండాలని ఎల్లమ్మ తల్లిని కోరుకున్నట్లు తెలిపారు. శాసన సభ ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చి సంవత్సరం పూర్తి అయిందని ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు జరుగుతున్నాయన్నారు. హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అవకాశం వచ్చిందన్నారు. హుస్నాబాద్ అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రజా సమస్యల కోసం కార్యాలయంలో ప్రత్యేక నెంబర్ వాట్సాప్ ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మూడు మార్కెట్ కమిటీలకు కొత్త పాలక వర్గాలు ఏర్పాటు చేసుకున్నామని, 4 దేవాలయాలకు కమిటీలు ఇంకా రావాల్సి ఉందన్నారు పని చేసే వారికి పదవులు వస్తాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారు సిద్ధంగా ఉండాలన్నారు.

చౌటపల్లి రైతులకు అన్యాయం చేయం

ఇండస్ట్రీయల్ పార్క్ కోసం చౌటపల్లి గ్రామస్తులకు బలవంతం చేయడం లేదన్నారు. పారిశ్రామిక కారిడార్‌కు సహకరించాలని ఎవ్వరికీ ఎక్కడ అన్యాయం చేయమన్నారు. టూరిజం పరంగా మహా సముద్రం గండి, ఎల్లమ్మ చెరువు సర్వాయి పాపన్న కోట, సింగరాయ జాతరను టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో 115 కోట్ల మంది మహిళలు ఇప్పటికీ ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. ఉచిత విద్యుత్,500 గ్యాస్ ఇస్తున్నామన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీలు 40 శాతం పెంచామన్నారు నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని పేర్కొన్నారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ పూర్తయిందని ఇంకా ఎవరికైనా కాకపోతే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. రూ 2 లక్షల పైన ఉన్నవారికి షెడ్యూల్ విడుదల అవుతుందని, అ పైన ఉన్న డబ్బులు చెల్లిస్తే అధి మాఫీ అవుతుందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా రూ 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆర్థిక విధ్వంసం జరగడంతో కొన్ని పథకాలు జాప్యం జరిగిందన్నారు. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో ముందుంచుతానని చెప్పారు. ఇప్పటికీ దాదాపు వెయ్యి కోట్లకు పైగా నిధులు హుస్నాబాద్‌లో వివిధ పనుల అభివృద్ధికి విడుదయ్యాయన్నారు. ప్రకృతి పరంగా ప్రమాద ఘంటిక మోగితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

హుస్నాబాద్ పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు కొణిజేటి రోశయ్య రాజకీయాల్లో విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన వారన్నారు. ఎవరైనా రాజకీయాల్లో ఎదగాలని అనుకుంటే రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతిపక్షాన్ని మాటల తూటాలు పేల్చడంలో కొట్టకనే కొట్టినట్టు మాట్లాడేవారన్నారు. భవిష్యత్‌లో రోశయ్యను స్పూర్తిగా తీసుకునే విధంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు ,సింగిల్ విండో చైర్మన్ శివయ్య, అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగంపల్లి ఐలయ్య, ఆర్డీవో రామ్మూర్తి, తహసిల్దార్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్.. ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకో

- ప్రశ్నించే గొంతుల్ని నొక్కే కుట్రలు సరికాదు
- రుణమాఫీపై సర్కార్‌ను నిలదీసినందుకే కక్షసాధింపు
- హరీశ్‌రావుపై పెట్టిన కేసు ఉపసంహరించాలి
- చిల్లరగాళ్ల పిర్యాదుతో కేసు పెట్టడం సరైందికాదు
- కేసులకు జంకేదుండదు...ప్రజల తరపున పోరాడుతం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్యరావు
- మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటిక్రాంతికిరణ్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకోవాలని, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుల్ని నొక్కే కుట్రలు మానుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్యరావు అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయకున్నా ప్రశ్నించే గొంతులను మాత్రం నొక్కలని చూస్తున్నారని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రతిపక్ష నేతగా హరీశ్‌రావు ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసి పోరాడిన ఫలితంగానే కొంతమేరకైనా రైరతులకు రుణాల్ని మాఫీ చేశారన్నారు. అందుకే హరీశ్‌రావుపై కక్షకట్టి చిల్లరగాళు, రౌడీలిచ్చిన పిర్యాదుతో అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. హరీశ్‌రావుపై పెట్టిన అక్రమ కేసును భేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాక్షస పాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చపోయినా ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపై కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. కేసుల పాలు చేసినంత మాత్రాన బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులెవ్వరూ భయపడే పరిస్థితిలేదన్నారు. మరింత ధైర్యంతో ప్రజల కోసం కొట్లాడుతామన్నారు. హరీశ్‌రావుకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాంపరింగ్ అనేది ఒక మంత్రిగా చేయగల్గిన పని కాదని తెల్సి కూడా ఒక పనికిమాలిన వ్యక్తి పిర్యాదు చేస్తే ఎలా కేసు పెడతారని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాంపరింగ్ చేశారని చక్రధర్‌గౌడ్ కోర్టులో పిటిషన్ వేశారని, అది కోర్టులో నిలవదనేది గ్రహించి పిటీషన్‌ను ఉపసంహరించుకున్నాడని గుర్తు చేశారు. కోర్టులో వీగిపోతదని తెల్సి పోలీసులకు పిర్యాదు చేశాడని, దాన్ని గుడ్డిగా నమ్మి ప్రభుత్వం కేసు పెట్టడం ఏమిటని నిలదీశారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాల్ని ప్రొత్సహిస్తున్నందున్నే సీఎం సోదరులు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సైదారెడ్డిపై దాడి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్థాయికి దిగజారి మాట్లాడుతున్న తీరు చూసిన జనం అసహించుకుంటున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యేలు మహారెడ్డి భూపాల్‌రెడ్డి, చంటిక్రాంతికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో అభివృద్ధిలో కేసీఆర్, హరీశ్‌రావు పాత్ర మరువలేనిదన్నారు. అలాంటి నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టి అప్రతిష్టపాలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తారో అనే విషయం కూడా తెల్లదా అని నిలదీశారు. బీఆర్ఎస్ శ్రేణుల్ని భయపెట్టాలనే దురుద్దేశంతోనే హరీశ్‌రావుపై తప్పుడు కేసు పెట్టారన్నారు. పార్టీ యావత్ హరీశ్‌రావుకు అండగా నిలుస్తుందని, రాబోయే కాలంలో ప్రభుత్వ వైఫల్యాలపై మరింత బలంగా పోరాడుతామన్నారు. చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి దళిత మహిళతో పాటు ఎంతో మందికి ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తి అన్నారు. అలాంటి వ్యక్తి ఇచ్చిన పిర్యాదు బేష్ చేసుకుని సీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడి కేసు పెట్టించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతప్తితో ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. సీఎం అన్నదమ్ములు దౌర్జన్యానికి పాల్పడితే వారిపై కేసులు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు జైపాల్ రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు, నాగరాజుగౌడ్, విష్ణు, శ్రవణ్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయాలి

పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతం కోసం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయడానికి అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు బకాయి ఉన్న వడ్ల డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. సంగారెడ్డి అన్ని విధాలుగా విస్తరిస్తున్న ఐటి హబ్ లేకపోవటంతో వెనుక పడిందన్నారు. సంగారెడ్డి అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. సంగారెడ్డి వరకు మెట్రో రైలు వేయాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తున్న సీపీఐ(ఎం)కు అందరూ అండగా నిలబడాలని.. ఈ నేపథ్యంలోనే పార్టీ మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అశోక్, ప్రసన్న, మహేష్, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతాంగానికి సాగు నీరు అందించాలి

- మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా రైతుల ప్రయోజనాల దృష్ట్యా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ వ్రాసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో సాగు, త్రాగు నీటికి నోచుకోలేదని. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌ల నిర్మాణాలను చేపట్టారన్నారు. ఈ రిజర్వాయర్‌ల ద్వారా వరుసగా గత మూడు సంవత్సరాలు జిల్లాలోని రైతాంగానికి గోదావరి జలాలు అందించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన నాలుగు ప్రాజెక్టు ల ద్వారా నాలుగు జిల్లాలు సిద్దిపేట, మెదక్, యాదాద్రి, జనగామలకు సాగు, త్రాగు నీరు అందించామని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. గత సంవత్సరం యాసంగి పంటకు కాళేశ్వరం జలాలతో నాలుగు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా కలిపి 3 లక్షల ఎకరాల పంట పండిందని గుర్తు చేస్తున్నానని, జిల్లాలోని ప్రాజెక్టులు మల్లన్న సాగర్‌లో ప్రస్తుతం 19.03 టిఎంసిలు, కొండ పోచమ్మ సాగర్‌లో 9.5 టిఎంసిలు, రంగనాయక సాగర్‌లో 2.57 టిఎంసీలు, అన్నపూర్ణ 3.21లు నీళ్ల అందుబాటులో ఉన్నాయని, ఈ సంవత్సరం కూడ యధావిధిగా సాగు నీరు అందించడానికి నీటి ప్రణాళిక కమిటీని ఆదేశించగలరని మంత్రిని కోరారు. నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ప్రభుత్వం తరుపున ఉమ్మడి జిల్లా రైతాంగానికి భరోసానివ్వాలని జిల్లా రైతుల పక్షాన విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి గాలికొదిలి.. ప్రతిపక్ష నాయకులపై కక్షపూరిత చర్యలు

- హరీశ్‌రావుపై తప్పుడు కేసులు పెడితే ప్రజలు సహించరు
- ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బిక్షపతి



నవతెలంగాణ-జోగిపేట

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి మాట గాలికి వదిలేసి.. ప్రతిపక్ష నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ కార్పొరేషన్ చైర్మెన్ మఠం బిక్షపతి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మాజీమంత్రి హరీశ్‌రావు నిజాయితీ, పాలనా దక్షత తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. గతంలో నిరుద్యోగులను నిండా మంచి ఉద్యోగాల పేరుతో దోచుకున్న దొంగ చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేస్తే పోలీసులు అత్యుత్సాహంతో కేసు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు. కనీస రాజకీయ అవగాహన లేకుండా పార్టీలు మార్చే చక్రధర్ గౌడ్ మాటలను నమ్మి కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు కేసులను, అబద్ధపు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న హరీశ్‌రావు గొంతు నొక్కడానికి ప్రభుత్వం అక్రమ కేసులను నమోదు చేస్తోందంటూ ఆరోపించారు.ఎన్ని అక్రమ కేసులు, నిర్బంధాలు చేసిన ప్రజల పక్షాన హరీశ్‌రావు కొట్లాడి తీరుతారన్నారు.

ఆశా వర్కర్లను వెంటనే పర్మినెంట్ చేయాలి

- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
- రెండేండ్ల పెండింగ్ లేప్రసి సర్వేల డబ్బులు ఇవ్వాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాములు గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్‌సీ, బిపి టెస్టు టార్గెట్ పెట్టకూడదని, స్పూటం డబ్బాలను తేవాలని ఒత్తిడి చేయడం సరికాదని, రెండేండ్ల లెప్రసి సర్వే చేసిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆశాలు పది లక్షల మంది పని చేస్తున్నారు. మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వీరు నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం నేటికి గుర్తించడం లేదు. ఏఎన్‌సి, బీపీ షుగర్ కేసుల టార్గెట్లు పెడుతున్నారన్నారు. రోజుకు 12-16 గంటలు పని చేయాల్సి వస్తుందన్నారు. ఆశాల ఆరోగ్యం దెబ్బతిని చివరికి ప్రాణాలు కోల్పోతున్నవారు పెరుగుతున్నారన్నారు. సిద్దిపేట ఇతర మున్సిపల్ పట్టణాలల్లో, కొన్ని గ్రామాలల్లో రెండు వేల జనభా నుంచి పది వేల జనభా వరకు ఉన్నదన్నారు. దీని వల్ల పని భారంతో పాటు సరైన సేవలు అందించలేకపోతున్నారన్నారు. కావున జనాభా పరిమితి ప్రకారం ఆశాలను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయకార్యదర్శి చొప్పరి రవికుమార్, ఇప్పకాయల శోభ, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ప్రవీణ, అధ్యక్షురాలు మంజుల, భాగ్యలక్ష్మి, లక్ష్మి, యాదలక్ష్మి, బాలమని తదితరులు పాల్గొన్నారు.



నేడు అందోల్‌లో రూ.100 కోట్ల పనులకు శంకుస్థాపన

పనులను పరిశీలించిన మంత్రి దామోదర్



నవతెలంగాణ-జోగిపేట

అందోల్‌లో రూ.100 కోట్లకు పైగా పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ నేడు(గురువారం) శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పనులను పరిశీలించారు. రూ.60 కోట్లతో 150 పడకల ప్రభుత్వాసు పత్రి, రూ.43 కోట్లతో నర్సింగ్ కళాశాల భవనం పనులకు మంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. నర్సింగ్ కళాశాల తరగతులను ప్రారంభించనున్నారు. నర్సింగ్ కళాశాలకు సంబంధించిన సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్ పద్మను అడిగి తెలుసుకున్నారు. భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ఏఈ మల్లప్పను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో పాండు, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కమిషనర్ తిరుపతి, మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, తహశీల్దార్ విష్ణు సాగర్, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు సురేందర్‌గౌడ్, ఆకుల చిట్టిబాబు, సురేష్, శంకర్, హరికృష్ణాగౌడ్, చందర్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

దారంతో మంత్రి చిత్రపటం





నవతెలంగాణ-మునిపల్లి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జన్మదినం సందర్భంగా మండలంలోని మల్లికార్జునపల్లి వాస్తవుడు మునిపల్లి ఆదర్శ కళాశాలకు చెందిన విద్యార్థి జహంగీర్ దారంతో మంత్రి చిత్రపటాన్ని తయారు చేశారు. రాయికోడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధాకర్ రెడ్డి సహకారంతో దాదాపు లక్షా యాభై వేల రూపాయలు వెచ్చించి 25 రోజుల కాల వ్యవధిలో చిత్రాన్ని తయారు చేసినట్టు జహంగీర్ తెలిపారు. విద్యార్థిలోని ప్రతిభ ఆసక్తి సృజనాత్మకతను పరిశీలించి అతడి ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతోనే ప్రోత్సహించి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు సుధాకర్ రెడ్డి చెప్పారు. కాగా మంత్రి చిత్రపటాన్ని 6000 మీటర్ల దారంతో తయారు చేయడం జహంగీర్ ప్రతిభకు నిదర్శనమని ప్రశంసించారు.

కొండగట్టు అంజన్న దర్శనానికి రండి

నీలం మధుకి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మత్స్యకార నేతల ఆహ్వానం



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న దర్శనం చేసుకోవడానికి రావాలని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధును ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు ఆహ్వానించారు. మండల పరిధిలోని చిట్కుల్లో గల క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మత్స్యకార సంఘం ముఖ్య నేతలు నీలం మధుతో బుధవారం మర్యాదపూర్వకంగా సమావేశమై.. అయి పలు విషయాలపై కూలంకుషంగా చర్చించారు. నీలం మధును ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులతో పాటు బీసీ, సబ్బండ కులాల అభ్యున్నతి కోసం నీలం మధు చేస్తున్న కృషిని కొనియా డారు. బీసీ కులగణన లో ముదిరాజ్ కులస్తులకు రాజకీయంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న నీలం భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తన మీద అభిమానంతో తనను ఆలయ దర్శనానికి ఆహ్వానించడం సంతోషంగా ఉందని.. తప్పకుండా దర్శనానికి వస్తానని నీలం మధు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ జడ్పిటిసి గుర్రాల మల్లేష్, రాష్ట్ర యువత అధ్యక్షులు పండుగ బాలు, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మరవెని తిరుపతి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంల మాజీ చైర్మెన్ పొలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి


- 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌కై జగ్గారెడ్డికి వినతి
- మంజీర స్పోర్ట్స్ క్లబ్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం, 400 మీటర్ రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మంజీర స్పోర్ట్స్ క్లబ్ పప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంజీరా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు గొల్ల మాణయ్య, కార్యదర్శి విఠల్, కమిటి సభ్యులు, ప్రతినిధులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంజీరా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు గొల్ల మాణయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎన్నో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ డిగ్రీ పిజి కళాశాలలతోపాటు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హాస్టల్ ఉన్నప్పటికీ క్రీడాపరంగా లోటు వచ్చినట్లు కనిపిస్తుందన్నారు. గతంలో సంగారెడ్డిలో వివిధ స్పోర్ట్స్ అకాడమీలు ఉండేవని తెలిపారు. ఇక్కడి నుంచి ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఘనత సంగారెడ్డికి ఉందని తెలిపారు. సంగారెడ్డికి స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ఇండోర్ స్టేడియం 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో అన్ని క్రీడా అంశాలకు చెందిన కోర్సులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రామచందర్ ఎన్నిక



నవతెలంగాణ-నిజాంపేట

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా లౌద్యా రామచందర్ ఎన్నికైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఆన్లైన్లో ఎన్నికలు నిర్వహించారని, కాశీపూర్ తాండాకు చెందిన రామ్ చందర్ ఆన్లైన్ ఎన్నికలలో విజయం సాధించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చందర్ మాట్లాడుతూ తనపూఐ నమ్మకం ఉంచి ఓటేసి గెలిపించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యం రెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ముత్యాల మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, మసూద్, లింగం గౌడ్, లక్ష్మారెడ్డి నర్లాపూర్, తదితరులు పాల్గొన్నారు.

పోతారంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం




నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామిక పంచాయతీ కేంద్రంలో బుధవారం ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం అయిందని ఖాజీపల్లీ ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ అడ్వకేట్ దండే రమాకాంత్ తెలిపారు. ఇందుకు కృషి చేసిన మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, గడ్డపోతారం మాజీ సర్పంచ్‌లు పులిగిల్ల ప్రకాష్ చారి, మధుర్ పటేల్ అశోక్, ఎంపీమాణిక్యరావు, మాజీ ఎంపీటీసీలు బాశెట్టి రాజు, జనాభాయ్, మాజీ ఉపసర్పంచ్ మమతా పెంటేష్, మాజీ వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి సూచనలు చేసి తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. జిన్నారం మండలంతో పాటు పటాన్చెరువు నియోజకవర్గం పరిధిలో ఖాజిపల్లి ఆర్కే ఫౌండేషన్ నేతృత్వంలో అనేక సేవా పరమైన సామాజిక కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతారం పంచాయతీ పరిధి గ్రామాలతో పాటు వావిలాల గ్రామపంచాయతీ వాసులు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిమోనియాతో బాలుడు మృతి

శోకసంద్రంలో తల్లిదండ్రులు
అనారోగ్యంతో బాలుడు మృతి
గజ్వేల్ మండలం దాతర్‌పల్లిలో విషాదఛాయలు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

నిమోనియాతో 8 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన జూపల్లి బాలయ్య, సంతోష దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అంగవైకల్యంతో జన్మించాడు. రెండవ కుమారుడు ధనుష్ (8) గజ్వేల్ గీతాంజలి స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నారు. గత 10 రోజులుగా అనారోగ్యంతో ధనుష్ ఆసుపత్రిలో చేర్పించారు. నిమోనియం వ్యాధితో బాధపడుతూ గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో పది రోజుల క్రితం టెస్టులు చేయించారు. పరిస్థితి ఆందోళనగా ఉండగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పది రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చలికాలం కావడంతో నిమోనియా వ్యాధి అధికమై ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారని తెలిపారు. బాలుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరి సంతానంలో పెద్ద కుమారుడు జన్మించినప్పుడే అంగవైకల్యంతో ఉండడం, మంచిగా ఉన్న చిన్న కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం పలువురి మనసును కలిచివేసింది. తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాలుడి పట్ల పాఠశాల యజమాన్యం విద్యార్థులు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మౌనం పాటించారు. అతిపిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడి మృతి చెందడం చాలా బాధాకరమని పాఠశాల యజమాన్యం విచారం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
గురువారం | 05 డిసెంబర్ 2024 | www.navatelangana.com

వర్గీకరణ జరిగే వరకు నియామకాలు చేపట్టొద్దు



నవతెలంగాణ-జహీరాబాద్

వర్గీకరణ జరిగే వరకు నియామకాలు చేపట్టవద్దని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏకసభ్య కమిషన్ చైర్మెన్ జస్టిస్ సమీమ్ అత్తర్‌కు సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షు లు అబ్రహం మాదిగ బుధవారం వినతి పత్రం అందజేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు వాటా దక్కేలా రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు అయ్యే వరకు ఎలాంటి నియామకాలు గానీ, నూతనంగా నోటిఫికేషన్లు గానీ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు సాడాకుల కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థల పరిశీలన



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వ స్థలాన్ని వెంటనే సర్వే చేయాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఆర్డీవో పాండు, తహసీల్దార్ కిరణ్ కుమార్, చౌటకూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరథ, మహిపాల్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్షలు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలోని స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల, మాదారంలోని పాఠశాలల్లో బుధవారం నేషనల్ అచీవ్మెంట్ టెస్ట్ సర్వే పరీక్షలు నిర్వహించారు. గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు 30 మంది, మాదారం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతికి చెందిన 19 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో చదువుల సామర్థ్యాన్ని అభ్యసన ప్రక్రియను పరిగణించే క్రమంలో దేశవ్యాప్తంగా న్యాస్ పరీక్షలు విద్యా శాఖ నిర్వహించింది. ఈ పరీక్ష కేంద్రాలను జిన్నారం మండల విద్యాధికారి కుమా ర స్వామి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిఆర్పిలు పాల్గొన్నారు

వర్గీకరణతో మాదిత ఉపకులాలకు న్యాయం



నవతెలంగాణ-సదాశివపేట

ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సుక్కల నాగరాజు అన్నారు. ఈ మేరకు వర్గీకరణపై వినతులు స్వీకరించడానికి సంగారెడ్డికి వచ్చిన ఏకసభ్య కమిషన్ చైర్మెన్ షమీమ్ అక్తర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఏ బీ సీ డీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టాపురం రాజు, మండల అధ్యక్షుడు మోహన్, నిజాంపురం మాణిక్ రావు, మారేపల్లి రమేష్, సూర్ణ రాజు, తుడుం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని బాన్స్‌వాడ గ్రామానికి చెందిన చాకలి లక్ష్మయ్య ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో అతడి భార్య అంజమ్మ అనాథగా మారి..కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నది. విషయం తెల్సుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మెన్ గుబ్బపు మచ్చేందర్ వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాలతో ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం గ్రామానికి వచ్చి ఆమెను ఓదార్చి నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సాగర్ అనుముల తుకారం, సాయిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమా టికెట్ ధరలను తగ్గించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

నేడు రిలీజ్ అవుతున్న పుష్ప-2 సినిమా టికెట్ ధరలను ప్రభుత్వం, ఫిలిం ఇండస్ట్రీ కమిటీ పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేస్తున్నామని.. పెంచిన సినిమా టిక్కెట్ల ధరలను తగ్గించాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ సినిమా విడుదల సందర్భంగా టిక్కెట్ల ధరలు పెంచడం అలవాటుగా మారిందన్నారు. నేడు రిలీజ్ అవుతున్న పుష్ప-2 సినిమాకి ప్రీ రిలీజ్ రోజు టికెట్ రేట్లు సుమారుగా రూ.800పైనే పెంచారన్నారు. అలాగే రూ.300, 400, 500లుగా టికెట్ ధరలను పెంచారన్నారు. టిక్కెట్ల ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులపై భారం పడుతోందని.. దాంతో వినోదాన్ని వారికి దూరం చేయడమే అవుతుందన్నారు. కాబట్టి పుష్ప-2 సినిమా టికెట్ల రేట్లు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీల గారడి



నవతెలంగాణ-జోగిపేట

కాంగ్రెస్ గ్యారంటీల గారడీ అని.. ఆరు అబద్ధాలు, 66 మోసాలు అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలు ఎండగడుతూ బుధవారం జోగిపేటలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక క్లాక్ టవర్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అనంత కులకర్ణి, ఆర్. ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు శివశంకర్, జోగిపేట నాయకులు గాజుల నవీన్, అనిల్, ఉల్వాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కేతకి హుండీ ఆదాయం రూ.32.98 లక్షలు



నవతెలంగాణ-ఝరాసంగం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. భక్తులు గత 89 రోజులుగా స్వామి వారికి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.32,98,710 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఇన్స్పెక్టర్ రంగారావు, ఈఓ శశిధర్, శ్రీరాజరాజేశ్వర సేవాసమితి, అర్చకులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షునిగా రాజు



నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షునిగా మండలంలోని పెద్దగోపులారం గ్రామానికి చెందిన బుర్కల రాజు ఎన్నికయ్యారు. ఓపెన్ కేటగిరిలో 968 ఓట్లతో గెలుపొందారు. ఈ పదవికి వచ్చినందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, త్రిష దామోదరకు ప్రత్యేక కృతజతలు తెలిపారు. అనంతరం బుర్కల రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతలు వచ్చేందుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ బుర్కల పాండుతో పాటు కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులకు ధన్యవా దాలు తెలిపారు. ఈ సందర్భంగా రెండోసారి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కాంగ్రెస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం కప్ నిర్వహణపై సమావేశం

నవతెలంగాణ-మునిపల్లి

మండల స్థాయిలో సీఎం కప్ క్రీడల నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు అధ్యక్షతన బుధ వారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణపై ఎంపీడీవో అవగాహన కల్పిం చారు. సీఎం కప్-2024లో భాగంగా గ్రామ స్థాయిలో 7, 8 తేదీల్లో.. మండల స్థాయిలో 10,11,12 తేదీల్లో ఆటల పోటీలను నిర్వహించాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీల్లో ప్రచారం (దండోరా) చేయించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ అండాలమ్మ, ఎంఈఓ భీంసింగ్, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు రామలింగం, వివిధ పాఠశాలల పీఈటీలు కరుణాకర్ రెడ్డి, గీత, సురేందర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



రుణాలు పెండింగ్ పెట్టొద్దు

- బ్యాంకర్లతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఇందిరా మహిళా శక్తి సంఘాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు బ్యాంకు లింకేజ్ రుణాలు పెండింగ్ పెట్టకుండా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ-ఇందిరా క్రాంతి వంటి ప్రాధాన్యత గల పథకాల కింద రుణాలను శీఘ్రంగా అందించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి సంఘాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ సంక ల్పానికి బ్యాంకులు సహకారాలు అందించాలన్నారు. సామాజిక, ఆర్థిక స్థిరత్వం సాధించడంలో మహిళల పాత్రను పెంపొందించేందుకు రుణాలు అందించాలన్నారు. రుణాలను ఇచ్చే ప్రక్రియలో పారదర్శకత , వేగం అవసరమన్నారు. బ్యాంకులు, రుణగ్రహీతల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇచ్చి, అవసరమైన చోట ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకోవాలని సూచించారు. రుణాల మంజూరులో సమస్యలు ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకులదే నన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా సామాజిక ప్రయోజనాలను సాధించడానికి బ్యాంకుల సహకారం కీలకమని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ మేనేజర్ తాన్య, నాబార్డ్ డీడీఎం కృష్ణ తేజ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్ రెడ్డి, జానకి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, పిడీ మెప్మా గీత, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామాచారి, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మహిళా స్వయం సహాయక సంఘాలు బలోపేతం చేయడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతన్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ వారోత్సవాల్లో భాగంగా.. బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాలుగు మహిళా స్వయం సహాక సంఘాల కు మంజూరైన రూ.50 లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంగ తాయారు, సీనియర్ నాయకులు కౌన్సిలర్ చంద్రారెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యాక్షనిస్టు రాజకీయాలు మానుకో'



నవతెలంగాణ-సంగారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యాక్షనిస్టులా వ్యవహరిస్తున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డిలు బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న గొంతులను సీఎం రేవంత్‌రెడ్డి నొక్కాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిస్టు రాజకీ యాన్ని సీఎం ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. హరీశ్‌రావు మీద పెట్టిన కేసును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రుణమాఫీపై హరీశ్‌రావు మాటల పదునుకు తట్టుకోలేక కొంత రుణమాఫీ చేశారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను హరీశ్‌రావు ఎత్తిచూపడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మింగుడు పట్టడం లేదన్నారు. అందుకని అక్రమ కేసులు పెట్టిస్తున్నారన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్, కేసీఆర్‌లకు కేసులేవి కొత్త కావన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక.. ఇలాంటి అక్రమ కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారన్నారు. ప్రభుత్వం హరీశ్‌రావు ఒత్తిడిని భరించలేకనే అక్రమ కేసులు పెడుతున్నదన్నారు. ప్రభుత్వం అక్రమంగా ఎన్ని కేసులు పెట్టినా.. ప్రజల తరపున ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, నాయకులు జైపాల్ రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు, నాగరాజుగౌడ్, విష్ణు, శ్రవణ్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ జిన్నారం

కాజీపల్లి అటవీ సందర్శనలో భాగంగా చెట్లపోతారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫారెస్ట్ అధికారులు, ఉపాధ్యాయ బృందాలు పర్యావరణ సమతౌల్యత, పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల పెంపకం ప్రాధాన్యత, సస్యశ్యామలమైన స్థితిగతులు తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు చేపట్టారు. వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుండి 10వ తరగతులకు చెందిన 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఫారెస్ట్ అధికారి షాహిన్ తరుణ్ణం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవావరణ వ్యవస్థలలో సమతౌల్యతతోనే జీవుల మనుగడ సుస్థిరమన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ విజయ్ కుమార్, చెట్ల పోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు షాకీర్ హుస్సేన్,ఉపాధ్యాయులు భాస్కర్, కాశీనాథ్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని పీచేర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహనా కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించార. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివలింగం, కోహిర్ మండలం ఎస్సై సతీష్, ట్రెయినీ ఎస్సైలు భీమ్రావు, అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న సైబర్ క్రైమ్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. గ్రామంలో ఎవరైనా మత్తు పదార్థాలు, గంజాయి ఉపయోగిస్తే తమకు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. కోహిర్ ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఫోన్లు వాడుతుంటారని.. సైబర్ క్రైమ్స్ వల్ల తల్లిదండ్రులకు జరిగే నష్టాన్ని విద్యార్థులకు చక్కగా వివరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం గురించి చక్కగా వివరించిన సీఐ, ఎస్ఐకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవి కిరణ్, వీరారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మహబూబ్, ఎంపీటీసీ సుభాంగి రాహుల్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ హేమలత, విద్యా కమిటీ మాజీ చైర్మెన్ శ్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేటలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలని చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్‌కి ఇటీవలే వినతి పత్రం అందజేశారు. దాంతో విగ్రహం ఏర్పాటుకు బస్‌స్టాండ్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపం పక్కన స్థలం కేటాయించడంతో మున్సిపల్ చైర్మెన్ అపర్ణ శివరాజ్ పాటిల్, వైస్ చైర్మెన్ చింతా గోపాల్‌లు అధికారులతో కలిసి స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడానికి సహకరించిన అధికారులకు, సదాశివపేట పట్టణ పద్మశాలి సంఘం సభ్యుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, టిపిఓ భాస్కర్ గౌడ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్, పద్మశాలి సంఘం సభ్యులు చిలువారి రవి, మధునల నర్సింలు, గుజ్జరి ఆంజనేయులు,రుమండ్ల రాజు, ఫని కృష్ణ, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల స్నేహా దృక్పథంతో నడుచుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

విద్యార్థుల పట్ల స్నేహ దృక్పథంతో నడుచుకుంటూ ప్రభుత్వ నిబంధనల అనుసారం భోజనాన్ని వడ్డించాలని ఆర్డీఓ రామిరెడ్డి సూచించారు. మండలంలోని అల్గోల్ గ్రామంలో గల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ ప్రణాళికలు అవలంబిస్తున్నారా లేదా విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెల్సుకున్నారు. విద్యను ఎలా బోధిస్తున్నారు.. పారిశుద్ధ్యం ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై.. పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెసిడె న్షియల్ పాఠశాలలకు కూరగాయలను సరఫరా చేస్తున్న వారు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో నాణ్యమైన ఆహారం లభించడం లేదని పలువురు విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇకముందు ఆ విధమైన ఫిర్యా దులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో కూరగాయలను నిల్వ ఉంచే స్టోర్లు, సంచులను నిల్వ ఉంచే స్టోర్లను పరిశీలించారు. పారిశుద్ధ్యం పాటించాలని ప్రిన్సిపల్ రాములుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ అభిలాషకు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని రసాయనశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి అభిలాష దుబ్బా డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'ఐదు హెటెరోసైక్లిక్ సమ్మేళనాలను కలిగి ఉన్న ఇండోల్ యొక్క సంశ్లేషణ, ఫార్మకోలా జికల్ మూల్యాంకనం' అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గ దర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల వెల్లడించారు. అభిలాష పరిశోధన ఫార్మాకోఫోర్ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగించి నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల సంశ్లేషణపై దృష్టి పెట్టడమే గాక, వాటి జీవసంబంధ కార్యకలాపాలను మూల్యాంకనం చేసినట్టు తెలిపారు. ఈ పరిశోధనలో సంశ్లేషణ చేసిన సమ్మేళనాలు నూతన క్యాన్సర్ నిరోధక, బాక్టీరియా నిరోధక ఏజెంట్ల కోసం అన్వేషణలో వి4 పీటీసీ ఔషధ గుణాలు గల అణువులుగా ఉపయోగపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, ఇది ఔషధ రసాయన శాస్త్రంలో మంచి పురోగతిని సూచిస్తోందన్నారు. అభిలాష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న శాస్త్రీయ సమూహానికి దోహదపడే వినూత్న పరిశోధన, విద్యా పురోగతిని గీతం ప్రోత్సహిస్తోందన్నారు. అభిలాష చేసిన ఈ పరిశో ధనా ఫలాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, పరిశో ధనా వాతావరణాన్ని పెంపొందించాలనే విశ్వవిద్యాలయ లక్ష్యాన్ని బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్షర స్కూల్ ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

వట్‌పల్లి అక్షర స్కూల్ ప్రిన్సిపల్ ఇటీవలే ఏడో తరగతి విద్యార్థిడిని చెట్టుకు కట్టేసి కొట్టాడని.. వెంటనే ఆ ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈవో వెంకటేశ్వర్లకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. చిన్నపిల్లాడు అని కూడా చూడకుండా ఏడో తరగతి విద్యార్థిడిని అక్షర పాఠశాల ప్రిన్సిపల్ హైమద్ చెట్టుకు కట్టేసి కొట్టడం శోచనీయ మన్నారు. వాస్తవానికి అక్షర పాఠశాలకు భవనం కూడా సరిగా లేదన్నారు. కనీసం ఆడుకోవడానికి గ్రౌండ్ కూడా లేదన్నారు. మరోపక్క సదరు ప్రిన్సిపల్ ప్రవర్తన బాగా లేదని గతంలోనే పుల్కల్ స్కూల్‌లో విద్యార్థిని తల్లిదం డ్రుల ం కేసు కూడా పెట్టారన్నారు. ఆ కేసు అలా ఉండగానే.. వేరే స్కూల్ తీసుకొని రన్ చేస్తున్నాడని మండి పడ్డారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని.. తద్వారా విద్యార్థులకు చదువు కూడా రావడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికా రులు స్పందించి తక్షణమే ఆ స్కూల్ గుర్తింపు రద్దు చేయాల న్నారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్య మాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు,రవి,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పై సాంస్కృతిక సారథి కళాప్రదర్శన



నవతెలంగాణ-జహీరాబాద్

కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షణలో నియోజకవర్గంలోని హుగ్గెల్లి, కాశింపూర్, గోపన్పల్లి గ్రామాల్లో సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి సంగారెడ్డి జిల్లా కళాకారులు బుధవారం కళా ప్రదర్శన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలు, అభివృద్ధి పథాన్ని వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీటీసీ, కార్మిక సంఘం నాయకులు హుగ్గెల్లి రామన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం, ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, యువ వికాసం, ఉద్యోగ నియామకాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షలకు పెంపు, మహిళలకు వడ్డీలేని రుణాలు, స్కిల్ యూనివర్సిటీ వంటి తదితర పథకాలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుగ్గెల్లి మాజీ సర్పంచ్ రాజు, హుగ్గెల్లి తాండ నాయకులు కిషన్ నాయక్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీమ్ లీడర్ ఆయిదాల సునీల్, డి.రమేష్, ఎస్. దుర్గేష్, ఎస్. మల్లేష్, పి సంధ్య, ఈ.వినేష్, బి. నవీన్ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ఓన్‌ప్లేట్ వాహనాలకు అనుమతివ్వొద్దు



నవతెలంగాణ-సదాశివపేట

ఇతర రాష్ట్రాలకు చెందిన ఓన్‌ప్లేట్ వాహనాలు సంగారెడ్డి, సదాశివపేటలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని.. అలాంటి వాటికి అనుమతులు ఇవ్వొద్దని సదాశివపేట ట్యాక్స్‌ప్లేట్ డ్రైవర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనాలను నడు పుతూ జీవనాధారం పొందుతున్న తమకు.. ఇతర రాష్ట్రాల వాహనాల యథేచ్ఛగా తిరుగుతుం డడంతో ఉపాధి లేకుండా పోతోందన్నారు. ఇష్టారీతిన ఆ వాహనాలు తిరుగు తున్నా అధికారులు పట్టిం చుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి లక్షల్లో టాక్స్‌లు కడుతూ, వాహనాలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని.. ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు ఇష్టారీతిన తిరుగుతుంటే తమ జీవనం ఎలా సాగాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అయ్యప్ప స్వాములు కూడా తమకు సహకరించి, శబరిమలకు పక్క రాష్ట్రాల నుంచి వాహనాలు బుక్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేశా రు. అధికారులు ఇతర రాష్ట్ర వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలుడి ఆరోగ్యం కోసం రూ.1.51 లక్షల సాయం

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ పట్టణంలో బోయిని మల్లికార్జున్ కుమారుడు అద్విత్ లుకేమియా వ్యాధితో బాధపడుతూ గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాలుడి చికిత్స కోసం రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. బాలుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఆర్థిక సాయం చేయాలని వాట్సాప్ గ్రూపులో పెట్టడంతో.. మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, అతని కుమారులు నాగరాజు, హరికృష్ణ, చంద్రశేఖర్లు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి రూ.1.51 లక్షల సాయాన్ని అందోల్‌లో బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ ప్రవీణ్ కుమార్, శ్యామ్ పంతులు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ-మెదక్ డెస్క్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రావెల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాడా వెంకట రాములు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జంగం రాములుతో పాటు 50 మంది కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జిన్న భగవాన్ రెడ్డి,కొడిప్యాక, నారాయణ గుప్తా, బాణాపురం రాజు, కుమ్మరి రఘుపతి, రాముని గారు శ్రీశైలం గౌడ్, చింతా రవీందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బజారు విశ్వరాజ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి మాణిక్యం రావు, దామోదర్ రెడ్డి, టీఎన్ శ్రీనివాస్, నాగరాజు గౌడ్, అనిల్, ఎండి ఉమర్ , అజర్ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా పర్శరామ్ గౌడ్



నవతెలంగాణ-హవేలీఘనపూర్

నూతన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షునిగా హవేలీ ఘనపూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పరుశురాం గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పరశురాం గౌడ్ ప్రకటించడంతో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పరశురాం గౌడ్‌కు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో మంచి నాయకునిగా ఎదగాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు రిజ్వాన్ ఎన్నిక పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పరశురామ్ గౌడ్ ఎన్నికకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు అభినందనలు తెలిపారు.

ఓపెన్ స్కూల్ గడువు పొడిగింపు



నవతెలంగాణ-పాపన్నపేట .

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడిగించినట్లు పాపన్నపేట మండల ఓపన్ స్కూల్ కోఆర్డినేటర్ మహేశ్వర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్ అహ్మద్ వెల్లడించారు. ఈ నెల 11 వరకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని, మిగతా వివరాలకు 9912335581 ఫోన్ నెంబర్‌లో కానీ పాపన్నపేట పాఠశాలలో కానీ సంప్రదించాల్సిలని వారు సూచించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

- యువజన క్రీడల నిర్వహణ అధికారి దామోదర్ రెడ్డి



నవతెలంగాణ-మెదక్

క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సీఎం కప్-2024 పేరుతో క్రీడాకారులకు పోటీలను నిర్వహించడం జరుగుతుందని యువజన క్రీడల నిర్వహణ అధికారి దామోదర్ రెడ్డి తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో డిసెంబర్ 07, 08వ తేదీలలో, మండల, మున్సిపాలిటీ స్థాయిలో డిసెంబర్ 10వ తేదీ నుంచి 12వ తేది వరకు పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 27 నుంచి వచ్చే నెల 02వ తేది వరకు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. గ్రామపంచాయత్, మండ జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రం, అధార్ కార్డును తప్పని సరిగా వెబ్ పోర్టల్ నందు అప్లోడ్ చేయాలన్నారు.

శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో సేఫ్ ఇండియా స్మార్ట్ లివింగ్ కార్యక్రమం



నవతెలంగాణ-మెదక్ డెస్క్

తూప్రాన్‌లో శ్రీ చైతన్య పాఠశాలలో సేఫ్ ఇండియా స్మార్ట్ లివింగ్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డ్రగ్స్‌కు బానిసైన యువత జీవితాలు ఎలా ఉంటాయో అని పోలీసులు అవగాహన కల్పించారు. అదే విధంగా ఏదైనా సెల్ ఫోన్‌కు అపరిచితుల నుంచి ఓటీపిలు వచ్చినప్పుడు స్పందించవద్దని సూచించారు. ఈ కార్యక్రమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డిబేట్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటూలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, డీన్ అశోక్, సి అండ్ ఐకాన్ ఇన్చార్జి రాజేష్, ఉపాధ్యాయులు ప్రసాద్, శేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాపన్నపేట విద్యార్థులు

నవతెలంగాణ-పాపన్నపేట

రాష్ట్ర స్థాయి మహిళా విభాగం కబడ్డీ పోటీలకు పాపన్నపేట విద్యార్థులు అశ్రీక, సభాసుల్తానా ఎంపికైనట్లు పిడి రమేష్ వెల్లడించారు. మాచారంలో ఈ నెల నాలుగున నిర్వహించిన పోటీలలో వీరు గెలుపొంది. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో వీరు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలోని శ్రీమతి రాయరావు సంస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఇంకా మూడు నెలలు సమయం మాత్రమే ఉందని అందులో 67 రోజులు కళాశాల పని దినాలు ఉన్నాయని తల్లిదండ్రులకు గుర్తు చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి రోజు కళాశాలకు మీ పిల్లలను పంపాలని తెలియజేశారు. రోజు కళాశాలకు హాజరైనట్లయితే లెక్చరర్ చెప్పే పాఠాలు పరీక్షలో వచ్చే ప్రశ్నలు నేర్పించి విద్యార్థులు పాస్ అయ్యే విధంగా మార్గ నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. కళాశాలకు గైరాజరైనట్లయితే లెక్చరర్ చెప్పే పాఠాలు మిస్ అవుతారన్నారు. వార్షిక పరీక్ష ఫీజు చెల్లించడానికి వంద రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 10వ తారీకు వరకు అవకాశం ఉందని సూచించారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులకు తల్లిదండ్రులు ఎలాంటి సొంత పనులకు ఉపయోగించకుండా ఖచ్చితంగా కళాశాలకు పంపే ప్రయత్నం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. హవేలీ ఘనపూర్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఔరంగాబాద్ చెరువులో పడి సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన బానోత్ నీల (40) మృతి చెందింది. మృతురాలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో గత నెల 28న కుటుంబ సభ్యులతో గొడవపడి మెదక్ పట్టణానికి వెళ్ళింది. గతంలో రెండు, మూడు సార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి తానే ఇంటికి వచ్చేదని కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో నీల కుమార్తె మౌనిక మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఔరంగాబాద్ చెరువులో మృదేహం కనిపించిందని సమాచారం అందడంతో పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మెదక్ పోచారం భయారణ్యంలో విద్యార్థులకు అవగాహన

- ఎఫ్ఆర్ఓ మనోజ్ కుమార్



నవతెలంగాణ-హవేలిఘనపూర్

పోచారం డిబిసిలో వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం-2024 సందర్భంగా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఎఫ్ఆర్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పోచారం అభయారణ్యంలో బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, పక్షుల పరిశీలన, వనదర్శిని, డిజిటల్ ఆవిష్కరణల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా అటవీశాఖ శాఖ కార్యక్రమాలు నిర్వహించాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజాపాలన, ప్రజా విజయోత్సవ వేడుకలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 9వ వరకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ ఎ.శ్రవంతి, బీట్ ఆఫీసర్లు రాము, ప్రియాంక, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు మొర పెట్టుకున్నా, ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికి అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని మండల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని గ్రామాల నుంచి జిల్లా గ్రంథాలయానికి ఏడాదికి దాదాపు రూ.లక్షల వరకు సెస్సు చెల్లిస్తారు. దాదాపు పదేళ్ల నుంచి పాలకులకు, అధికారులకు మొర పెట్టుకున్నప్పటికి వారు పట్టించుకోలేకపోయారని, గ్రంథాలయాలు లేక యువతీ యువకులు పోటీ పరీక్షలకు చదువుకోలేకపోతున్నారు. దీంతో కొంతమంది యువకులు చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లయితే ప్రతిరోజు యువతీ యువకులు అక్కడికి వెళ్లి చదువుకొని జ్ఞానాన్ని సంపాదించుకొని పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై ఉద్యోగాలు పొందడానికి సులభతరంగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వాలు దేవాలయాలకు ప్రాధాన్యత ఇస్తుంది కాని గ్రంథాలయాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లయితే వేలమంది విజ్ఞానవంతులు తయారవుతారు. సంబంధిత అధికారులు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు వెంటనే స్పందించి మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



గరుగుల మహేష్, నిజాంపేట వాసి

ఎన్నో ఏండ్ల నుంచి మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని అధికారులకు పాలకులకు మొరపెట్టుకున్నప్పటికి నేటికి గ్రంథాలయం ఏర్పాటు చేయలేకపోయారు. గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లయితే యువతీ యువకులు గ్రంథాలయంలో చదివి పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి ఎంతో సులభంగా ఉంటుంది. ఎమ్మెల్యే స్పందించి వెంటనే మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

ఆశ వర్కర్లకు నెలసరి వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ వినతిపత్రం



నవతెలంగాణ-మెదక్

ఆశ వర్కులకు నెలసరి వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకురాళ్లు నరసమ్మ బాలమణిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మెదక్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామాలలో పని చేస్తున్నారన్నారు. అయినా వారి నేటి వరకు ఎలాంటి ఫిక్స్ వేతనం నిర్ణయించలేదన్నారు. ఆశ వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వీధి దీపాలు లేక ప్రజలంతా అల్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సబితా, చంద్రకళ, మంజుల, లక్ష్మీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు

కలెక్టరేట్‌కు రాకపోకలకు కష్టాలు

- ప్రజలు, కలెక్టరేట్ ఉద్యోగుల అవస్థలు
- కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-మెదక్

నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం మెదక్ కలెక్టర్ కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. కలెక్టరేట్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులో లేకపోవడం ప్రజలకు, కలెక్టరేట్ ఉద్యోగులకు ఇబ్బందులను కలిగిస్తోంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు కనీసం రోజుకు మూడు ట్రిప్పు లు నడిపే ఏర్పాట్లు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తు న్నారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఆటోలను ఎక్కువగా ఆశ్రయించాల్సి వస్తుంది. ఆటో డ్రైవర్లు ప్రయా ణికులను పరిమితికి మించి ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఉద్యోగస్తుల ఇబ్బందులు

కలెక్టరేట్‌లో ఉన్న 40కు పైగా శాఖలకు చెందిన ఉద్యోగుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు సమయానికి కార్యాలయాలకు చేరుకోవడం కష్టమైపోతోంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, పిల్లలతో కలిసి పని చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రతి రోజు బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తే, రవాణా సమస్య నుంచి ప్రజలు ఉపశమనం పొందుతారు. జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ సమస్యను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు సీఎం దివాలకోరు రాజకీయాలకు నిదర్శనం

- మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్

నవతెలంగాణ-మెదక్ టౌన్

తెలంగాణలో రేవంత్ రెడ్డి, చక్రధర్ గౌడ్‌లాంటి సంస్కారం లేని చిల్లర నాయకుల ద్వారా మాజీ మంత్రి హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయించడం సీఎం దివాలా కోరు రాజకీయాలకు నిదర్శనమని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. ఇది మూర్ఖపు చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే తన జీవిత ధ్యేయంగా పని చేస్తున్న మాజీ మంత్రి హరీష్ రావుపై కేసు నమోదు చేయడం యావత్తు తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నదన్నారు. అంతేకాకుండా అమలు గాని హామీలు ఇచ్చి గద్దెనె క్కిన ఈ ప్రభుత్వం మోసపు విధానాలు ఎండగడుగుతా మన్నారు. ప్రజలకు అండగా నిలుస్తున్న హరీష్ రావును అక్రమ కేసులతో నియంత్రించాలని అనుకోవడం అరచేతితో సూర్య కాంతిని ఆపినట్లు అవుతుందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన హరీష్ అన్న రాష్ట్ర ప్రజల కొరకు ధైర్యంతో ముందుకు సాగుతూనే ఉంటాంన్నారు. యావత్తు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులందరం అండగా ఉంటామని, ఇకనైనా ఈ ఊకదంపుడు ఉపన్యాసాలు మాని నాయకులపై అక్రమ కేసులు పెట్టడం పక్కన పెట్టి ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు. హరీష్ రావును ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

బీఆర్ఎస్ నాయకులు మామిండ్ల ఆంజనేయులు



హరీష్ రావును రాజకీయంగా ఎదుర్కొలేక ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుందని, ఇలాంటి చర్యలను బిఆర్ఎస్ పట్టణ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని బీఆర్ఎస్ నాయకుడు మామిళ్ళ ఆంజనేయులు అన్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీని రైతుభరోసాను ఇవ్వకుండా మాట తప్పిన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను చీల్చి చెండాడుతున్న హరిశ్‌రావును ప్రజల పక్షాన మాట్లాడకుండా ఉండడానికే అక్రమ కేసులు వేసి జైలులో ఎట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలే హరీష్ రావును కాపాడుకుంటారన్నారు.

సొంత భవనంలోకి గ్రంథాలయాన్ని మారుస్తాం

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

అతి త్వరలోనే సొంత భవనంలోకి గ్రంథాలయాన్ని మారుస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయాన్ని అకస్మాత్తుగా తనిఖీ చేపట్టారు. ముందుగా భవనాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలువురుతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత 15 సంవత్సరాల క్రితం మండల కార్యాలయం పక్కన నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పంచాయతీరాజ్ కార్యాలయంగా మార్చారు. త్వరలోనే ఆ భవనంలో గ్రంథాలయాన్ని మారుస్తామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా శిథిలా వస్థలో గ్రంథాలయం ఉందని అది గ్రామంలో ఉండడంతో పాఠకులకు ఇబ్బంది అవుతుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రంథాలయాన్ని అన్ని పుస్తకాలతో విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ, గ్రూప్స్, పోటీ పరీక్షలకు చదువుకునే విధంగా అన్ని పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, లైబ్రేషన్లు, నరేందర్ రెడ్డి, శంకర్, స్వామి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

- పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్



నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుడు అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో అతని కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోయినారు. అతని కుటుంబానికి తూప్రాన్ మండల తోటి కార్మికులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పేర్కొన్నారు. తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు పుట్ట దుర్గయ్య గత నెల 25న ఆరోగ్యం బాగోలేక ఇంటి దగ్గర చనిపోయినాడు. వారి ఆర్థిక పరిస్థితి గమనించిన మండల కేంద్రంలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు ఆర్థిక సాయంగా రూ.5 వేలు తూప్రాన్ మండల అధ్యక్షులు మహేష్ మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శేఖర్, కిష్టయ్య, యాదగిరి, నాగరాజు, నర్సింగరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం

- బాల్య వివాహం అవేర్నెస్ విజన్ ప్రాజెక్టు అధికారి కైలాస్



నవతెలంగాణ-వెల్దుర్తి

బాల్యవివాహాలు నిర్వహించినట్లయితే బాల్యవివాహాల చట్ట ప్రకారం ఫోక్స్ యాక్ట్ చట్ట ప్రకారం శిక్షకు గురి చేయడం జరుగుతుందని బాల్య వివాహం అవేర్నెస్ విజన్ ప్రాజెక్టు అధికారి కైలాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యతో కలిసి బాల్య వివాహాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బాల్యవివాహాల అవేర్నెస్ విజన్ ప్రాజెక్టు అధికారి కైలాస్ మాట్లాడారు. 18 సంవత్సరాల నిండని అమ్మాయిలు, 21 సంవత్సరం నిండని అబ్బాయిలు పెళ్లి చేసుకోకూడదని, అలా చేసుకుంటే జరిగే అనర్థాలపై వివరించారు. బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలు, చట్టాల గురించి చెప్పడం జరిగింది. అలాగే బాల కార్మికులు, బాలలను వేధింపులు బాలల అక్రమ రవాణా గురించి వివరించారు. బాల్యవివాహాలు లేని దేశం కోసం పాటు పడదామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, నరసింహారెడ్డి చార్లెస్, అమూల్య, సునీత, శైలజ, వెంకటరెడ్డి, విజయ్, ప్రశాంతి, రాధిక, రేణుక, అర్చన, పాల్గొన్నారు.

నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ కుమార్



నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా వెంటనే రెండవ పీఆర్సీని ప్రకటించి అమలు పరచాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రణీత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో టిఆర్‌టిఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్యతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణీత్ కుమార్ మాట్లాడారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు కూడా భాగస్వాములేనని, వారి భాగస్వామ్యంతోనే ప్రభుత్వం విజయాలు సాధిస్తుందన్నారు. విజయ ఫలాలను ఉద్యోగులకు కూడా అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు పంపించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యారంగ సంస్కరణలపై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో విద్యారంగ నిపుణులతో చర్చించి విద్యార్థులకు శ్రేయస్సు కలిగించే నిర్ణయాన్ని అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పరుశురాం, మల్లేశం, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడ్డ భార్యాభర్తల అరెస్ట్



నవతెలంగాణ-రామాయంపేట

జల్సాలకు అలవాటు పడి, వృద్ధులను టార్గెట్‌గా చేసుకొని దొంగతనానికి పాల్పడ్డ భార్యాభర్తలు పోలీసులకు పట్టుబడ్డారు. రామాయంపేట సిఐ వెంకట్ రాజా గౌడ్ కథనం ప్రకారం.. దుబ్బాక మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన బండ్ల నర్సవ్వ అనే వృద్ధురాలు నవంబర్ 30న, చేగుంట నుంచి తన సొంత గ్రామం వెళ్లే క్రమంలో చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ తాండకు చెందిన ధరావత్ శ్రీను, అతని భార్య భూలిలు వృద్ధురాలిని బస్సులో పరిచయం చేసుకొన్నారు. వృద్ధురాలి ఒంటి మీద ఉన్న నగలు ఎలాగైనా దొంగతనం చేయాలని ప్లాన్ వేశారు. రామాయంపేట బస్టాండ్‌లో దిగగానే, కల్లు తాగుదామని దగ్గరలో ఉన్న కల్లు దుకాణంకు తీసుకెళ్లారు. కల్లు తాగిన తర్వాత ఆమెను కాళ్లగడ్డ దగ్గర్లోని నిర్మానుష్య ప్రదేశంకు తీసుకెళ్లి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, చెవి పోగులు, కాళ్ళ కడియాలు తీసుకొని, ఆమెను ఆటోలు పంపించి వేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు, మంగళవారం వారిని అరెస్టు చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఆటో డ్రైవర్ మహిపాల్‌కు సన్మానం



ఈ కేసులో మండల పరిధిలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మహిపాల్ ఇచ్చిన సమాచారం మేరకు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని రామాయంపేట సిఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు. ఈ మేరకు మహిపాల్‌ను సన్మానించి రివార్డు అందజేశారు. ప్రతి ఒక్కరు మహిపాల్ లాగా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సిఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు. అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

జాతీయ క్రీడలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి



నవతెలంగాణ-మెదక్ టౌన్

ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు జరగనున్న జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం (ఎంపీసీఎస్) చదువుతున్న మొహమ్మద్ అమానుద్దిన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా విభాగం నుంచి తమకు సమాచారం అందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.కె. హుస్సైన్ తెలిపారు. గతనెలలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో అమానుద్దిన్ 100 మీటర్ల, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని బంగారు పథకం సాధించాడని తెలిపారు. ఈ క్రీడలలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు తెలియజేశారు. సాధారణ పేద కుటుంబం నుంచి వచ్చిన అమానుద్దీన్ జాతీయ స్థాయి క్రీడలలలో పాల్గొనే అవకాశం రావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ జాతీయ స్థాయి క్రీడలలో తన సామర్థ్యం మేరకు రాణించి కళాశాలకు, మెదక్ పట్టణానికి గుర్తింపు తేవడానికి సాధన చేస్తున్నట్లు తెలిపాడు. నిరంతరం తగిన శిక్షణను అందించిన మెదక్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఏ. మధుసూదన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిత్యం తనను ప్రోత్సహిస్తూ క్రీడలలో పాల్గొనటానికి సహకరించిన కళాశాల ఇంచార్జ్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అమానుద్దీన్‌ను కళాశాల అధ్యాపక బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కళాశాల గేమ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ విశ్వనాథం, సుధారాణి, హరిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన

- ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధి సెరిలా అంగన్వాడి కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన వంటి కార్యక్రమాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు దేవలత, లక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని మాధురి, వెల్దుర్తి పిహెచ్సి డాక్టర్ శిరీష హాజరయ్యారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి మాట్లా డారు. గర్భిణీలు బాలింతలు అంగన్వాడి కేంద్రంలో అందిం చే పౌష్టికాహారాన్ని ఇక్కడే భుజించాలని సూచించారు. డాక్టర్ శిరీష మాట్లాడారు గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్ సలహా మేరకు మందులు వాడుకోవాలని సూచించారు. డెలివరీ సమయం లో ప్రభుత్వ ఆసుపత్రిలోనే నార్మల్ కాన్పు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. మెదక్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని మాధురి మాట్లాడారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారుల శ్యామ్, మ్యామ్, వివరాలను అడిగి తెలుసుకున్నారు. వయసుకు తగ్గ బరువు లేకపోతే తీసుకోవలసిన జాగ్రత్తలపై అంగన్వాడి టీచర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్ మంజుల, ఆయా శ్రీజ, గర్భిణీలు బాలింతలు చిన్నారులు ఉన్నారు.

ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి ఆర్డిఓలకు అధికారం

తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి

నవతెలంగాణ-మెదక్ డెస్క్ : రాష్ట్ర ప్రభుత్వం ధరణి పెండింగ్ ఫైళ్ళకు సంబంధించిన సమస్యలపై పరిష్కారానికి ఆర్డిఓలకు అధికారాలు ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చారని తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి ఫైళ్లను క్రమం తప్పకుండా పునః పరిశీలించి పరిష్కారం చూపిస్తూ, తుది ఆమోదాన్ని తెలుపుతున్నట్లు తెలిపారు. అసైన్డ్ భూములతో సహా వారసత్వం కోసం దరఖాస్తు (పట్టాదారు పాస్ బుక్ లేకుండా) పెండింగ్లో ఉన్నా, నాలా దరఖాస్తులను, డిజిటల్ సంతకాలు పెండింగ్లో ఉంటే తదితర సమస్యలపై ఆర్డిఓ కార్యాలయంలో పరిష్కారాన్ని చూపుతున్నట్లు ఆర్డిఓ జయచంద్రారెడ్డి తెలిపారు.

317 బాధిత ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

- పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

317 బాధిత ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి కోరారు. బుధవారం మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సిద్దిపేట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిద్దిపేటలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయులను ప్రత్యక్షంగా కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘం బలపరిచిన అభ్యర్థి అయిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పైన తాను ఉద్యమిస్తానని అన్నారు. గెలిపిస్తే మండలిలో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధరాసుపల్లి శశిధర శర్మ, నాయకులు వెంకట్ రాం రెడ్డి, పార్థసారధి, వెంకట్ నరసింహ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యునిగా బాల్ నరసయ్య



నవతెలంగాణ-కొండపాక

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యునిగా బాల్ నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఇటీవల గజ్వేల్ పట్టణంలో విజయవంతంగా ఆ పార్టీ మహా సభలు ముగిశాయి. ఈ మహాసభలో 21 మందితో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత మూడేండ్లగా జిల్లాలో కార్మిక, ప్రజా పోరాటాలు, సమస్యలపై చేసిన అనేక ఉద్యమాలపై సమీక్షలు నిర్వహించారు. రాబోవు మూడేండ్లల్లో అన్ని రంగాల్లో ఉన్న కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పోరాటాలకు రూపకల్పన చేసుకొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో కొండపాక మండలం, వెలికట్ట గ్రామానికి చెందిన అమ్ముల బాల్ నర్సయ్యను తిరిగి జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలను గుర్తించి తమపై నమ్మకంతో పెట్టిన బాధ్యతను పార్టీ ఇచ్చిన పిలుపులను అమలు చేస్తానని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్న పార్టీకి నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజాపాలన విజోత్స వాల వేడుకల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్లు వనిత, మాధవిలు విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించామన్నారు. రెసిడెన్షియల్ బ్రిడ్జ్ పాఠశాలలోని విద్యార్థులకు నిత్యం ప్రతిరోజు ఇంట్లో వెలువడే తడి, పొడి, హానికర చెత్త వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు. పట్టణంలో తడి చెత్త ద్వారా తయారవుతున్న ఎరువు తయారీ విధానం, బయో గ్యాస్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎర్ర చెరువు కట్టపైన పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు.

భూ ప్రకంపనాలతో భయాందోళనలు

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని పాత బస్టాండ్ వెనక ప్రాంతంలో, కోటిలింగాల దేవాలయ ప్రాంతం, శ్రీనగర్ కాలనీల్లో, బీజేఆర్ చౌరస్తా ప్రాంతంలో ఉదయం కొన్ని సెకండ్ల పాటు భూకంపం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. భూకంప తీవ్రత అంతగా లేకపోవడంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం లాంటివి జరగలేదు. కానీ ఉదయం సమయంలో తాము ఉన్న ప్రాంతంలో కదలికలు రావడంతో ప్రజలు కొంత భయానికి గురయ్యారు.

నవతెలంగాణ-నంగునూరు

బుధవారం ఉదయం భూ ప్రకంపనలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నంగునూరు మండల పరిసర ప్రాంతాల్లో పలు సెకన్ల పాటు భూమి కంపించిందని ప్రజలు ముచ్చటించుకున్నారు. దీంతో ప్రజలు భయంతో ఇళ్లు, అపార్ట్మెంట్లు నుంచి బయటకు పరుగులు తీశారు. సిద్దిపేట పట్టణంతో పాటు, సిద్దిపేట, నంగునూరు, కోహెడ మండలాల్లోని వివిధ గ్రామాలలో భూమి కంపించిందనే వార్తలు వినిపించాయి. రెండు నుంచి అయిదు సెకన్ల పాటు భూమి కంపించిందనే ఒకరి నొకరు మాట్లాడుకుంటున్నారు. ఇంట్లో ఉన్న సామాన్లు, బీరువాలు బిల్డింగులు, ఊగడం, భూమి ఊగినట్టుగా ఆనవాళున్నాయి. ఒక్క సారిగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

గడ్డి కోత మిషన్‌లో ఇరుక్కొన్న చేయి

- ఒకరికి తీవ్ర గాయాలు





నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామం రైతు శ్రీశైలంకు చెందిన వ్యవసాయ పొలం వద్ద బీహార్‌కు చెందిన రాజు పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రషర్ మిషన్‌లో కుడి చేయి ఇరుక్కొన్నది. ఆ చేయి వేళ్ళు పూర్తిగా విరిగి పోయాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్‌లు చేరుకుని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి శివకుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి శివకుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నన్ను నియమించిన జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేస్తున్నానని, నియామనికి సహకరించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా మాజీ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగ మూర్తి, మహాసభ రాష్ట్ర నాయకులు, జిల్లా మాజీ అధ్యక్షులందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో కృష్ణవేణికి బ్రాంజ్ మెడల్



నవతెలంగాణ-సిద్దిపేట

హనుమకొండలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో నిర్వహించారు. ఆ పోటీల్లో సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తరపున ఆరుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో కృష్ణవేణి ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారని పాఠశాల హెచ్ఎం మనోహర్ తెలిపారు. బుధవారం పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు బాల సరస్వతి, ప్రభు, ఉపాధ్యాయ బృందం ఫిజికల్ డైరెక్టర్ సుజాతను, కృష్ణవేణిని అభినందించారు.

ఉపాధ్యాయురాలికి ఘన వీడ్కోలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయు రాలు ధనలక్ష్మి, కోహెడ మండలం బస్వాపూర్ పాఠ శాలకు బదిలీపై వెళ్లారు. బుధవారం ఆమెను మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థిని విద్యార్థులు మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించి ఘన వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయురాలు మంజులను శాలువ కప్పి ఆహ్వానించారు. ప్రధానోపాధ్యాయుడు వడ్లకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారోజు శంకరాచారి, శ్రీవిద్య, సంతోష, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేబర్తి గ్రామం సందర్శన

- ఉపాధి హామీ చట్టం ఇంటర్నల్ ఆడిట్ బృందం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో జరిగిన పనులను ఇంటర్నల్ ఆడిట్ బృందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్నల్ ఆడిట్ బృందం టీం మెంబర్స్ శేషు కుమార్, శ్యామల లు మాట్లాడుతూ గ్రామంలో 2020-2021, 2021-2022, 2022-2023 లో జరిగిన ఉపాధి హామీ చట్టం పనులను ఫీల్డ్‌లో తిరిగి పరిశీలించినట్లు తెలిపారు. ఈసీ పరశురాం, పీఆర్ఏఈ లు వినయ్ కుమార్ రెడ్డి, గౌస్ మొయినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, టి ఏ వెంకటమ్మ ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం సిద్దన్నపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని గ్రామ ప్రత్యేక అధికారి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట మున్సిపల్‌లో పనిచేస్తున్న డైలీ వైజ్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించి వారికి గ్రూపులు ఏర్పాటు చేసి పీఎఫ్ డబ్బు లు జమ చేయా లని మున్సి పల్ వర్కర్స్ అండ్ ఎంప్లా యిస్ యూనియన్ సిద్దిపే ట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్ప రి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డైలీ వేజ్ కార్మికుల సమస్య లపైన మున్సిపల్ కార్యలయం ముందు ధర్నా చేసి అనంత రం మున్సిపల్ మేనేజర్‌కి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లా డుతూ గత ఆరు ఏండ్ల క్రితం 80 మంది కార్మికులని డైలీ వేజ్ కింద సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి రూ.12వేలు వేతనం ఇస్తామని చెప్పి వారిని పనుల్లో పెట్టుకున్నారు. కానీ మున్సిపల్‌లో దాదాపు 300 మంది కార్మికులు ఉంటే 220 మంది కార్మికులకి జీవో నెంబర్ 60 ప్రకారం రూ.16,500 పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇస్తున్నారు. కానీ డైలీవైజ్ కింద తీసుకున్నటువంటి ఈ 80 మంది కార్మి కులకు రూ.12వేలు చెప్పిన ప్పటికీ ఇచ్చేది మాత్రం 10వేల లోపే అని వారిని శ్రమ దోపిడికి గురి చేస్తూ జీతాలు సరిగ్గా ఇవ్వకుండా గ్రూపులు చేయకుం డా పీఎఫ్ డబ్బులు జమ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నారని ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకొని వారికి గ్రూపులు ఏర్పాటు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు డి.రాజయ్య, వినోద, కవిత, మహేష్, నరసవ్వ, బాలమణి, పాల్గొన్నారు.

యాసంగి వరి నారు సకాలంలో పోసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

వరి సాగు చేసి రైతులు వరి నార్లు సకాలంలో పోసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలో రైతులు వానాకాలంలో నార్లు ఆలస్యంగా పోసుకుంటే పంట దిగుబడి తగ్గుతున్నాయన్నారు. యాసంగిలో కోసే సమయంలో వడగండ్లు వర్షాలు కురిసి రైతుల నష్టపోతున్నారని సూచించారు. కావున రైతులు దీర్ఘకాలిక రకాలను (150 రోజులు) జూన్ చివరి వరకు మధ్యకాలిక రకాలను (135 రోజులు) జూలై 15 లోపు స్వల్పకాలిక రకాలను (120రోజులు) జూలై చివరి వరకు నార్లు పోసుకోవాలన్నారు. నారుమడి పెంపకం నారుమడిని బాగా దున్నిన తర్వాత రెండు లేదా మూడు సార్లు దమ్ముచేసి చదును చేసుకోవాలన్నారు. కొంచెం ఎత్తులో నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకుం టే మంచిదని,ఎకరానికి సరిపడే నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లెముందు కిలో, 12-14 రోజులకు మరో కిలో), కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. జింకు లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. మెట్ట నారుమడిలో ఇనుప ధాతులోపాన్ని గమనిస్తే సరిచేసుకోవాలన్నారు. నారుపీకే ఏడు రోజుల ముందు ఒక్కో గుంట మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి చల్లుకోవాలి. పలుచగా నీరు ఉంచాలని సూచించారు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- రంగధాంపల్లి శ్రీ చైతన్య విద్యార్థుల ప్లకార్డులతో ప్రదర్శన



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్.

సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి శ్రీ చైతన్య విద్యార్థులు బుధవారం ట్రాఫిక్ నిబంధన పట్ల అవగాహన కల్పిస్తూ, పాఠశాల నుంచి రంగదాంపల్లి చౌరస్తా వరకు విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా దగ్గర మానవహారం నిర్వహించిన విద్యార్థులు వాహనదా రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపీ మధు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్, షీ టీం, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ వాహనాలు మైనర్లు నడప రాదని విద్యార్థులకు సూచిం చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడు తూ స్కూల్ యాజమాన్యం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి నెలకి ఒక్క సామాజిక కార్యక్రమాన్ని వారికి సమాజం పట్ల ఉన్న బాధ్యతను తమ పాఠశాల గుర్తు చేస్తుందన్నారు. ప్రమా దాల నివారణ ఏ ఒక్కరి బాధ్యత కాదని ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్ర మానికి పోలీస్ శాఖ అనుమతిం చినందుకు సిద్దిపేట పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మెన్ శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం మధుసూదన్ రెడ్డి, కోఆర్డినేటర్ రాంబాబు, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఎస్ బ్యాచ్ ఇంచార్జ్ హనుమాన్, ప్రయిమరీ కోఆర్డినేటర్ మహాలక్ష్మి, ప్రీ ప్రయిమరీ కోఆర్డినేటర్ సరిత, ప్రయిమరీ ఇంచార్జ్ రమాదేవి, ప్రీ ప్రయిమరీ ఇంచార్జ్ శివగంగా, ఏవో రాములు, ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డ్‌లోని హౌసింగ్ బోర్డ్, భరత్ నగర్ కాలనీలో మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న. రాజమౌళి, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పాల్గొనిబేసిల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెత్త సేకరణ లో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ తడి చెత్త పొడి చెత్త పై అవగాహన ప్రజలకు వివరించారు. తడి పొడి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగస్వాములై స్వచ్ఛ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కీ కృషి చేయాలని అన్నారు. అలాగే రోజు ఒక వార్డ్ లో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో ప్లాస్టిక్ కానీ, డైపర్లను గాని ఇతర వస్తువులను వేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, బేసిల్ ఫౌండేషన్ సభ్యులు, హౌసింగ్ బోర్డు అధ్యక్షులు తిరుపతి రెడ్డి, నాయకులు మల్లేశం గౌడ్, రాజారామ్, మహబూబ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు శేషం శ్రీనివాస్ , అతేల్లి శ్రీనివాస్, ఆర్ పి పద్మ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మూడింతల పరిహారం ఇవ్వండి

- గజ్వేల్ ఆర్డీవోకు ట్రిబుల్ ఆర్ నిర్వాసితుల వినతిపత్రం వినపత్రం



నవతెలంగాణ-గజ్వేల్

రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న భాదితులు తమకు ఎకరాకు బహిరంగ మార్కెట్ రేటు పై మూడు రెట్లు పెంచి నష్టపరిహారాన్ని చెల్లించాలని గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. బుధవారంగజ్వేల్ ఆర్డీవో కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువైన భూములను కోల్పోతున్నామని తమకు మూడంతల పరిహారము ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా అనేక భూములు కోల్పోయినట్లు పేర్కొన్నారు. ట్రిబుల్ ఆర్ పేరిట మళ్లీ భూములు లాక్కుంటున్నారని అయినా భూములు బలవంతంగా తీసుకున్నందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తుందన్నారు. మార్కెట్లో రేటు అనుగుణంగా తమకు పరిహారం ఇస్తే భూములు ఇస్తామని వారు చెప్పారు. సర్వం కోల్పోయి తాము ఏం చేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ నియోజకవర్గం లోని వర్గల్ మండలం సాములపల్లి, జగదేపూర్ మండలం అల్లి రాజ్ పేట్, ఇటిక్యాల, గజ్వేల్ పట్టణ రైతులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దు
- మర్కుక్ ఎస్ఐ దామోదర్



నవతెలంగాణ-మర్కుక్

సైబర్ మోసాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనుందని, గంజాయి డ్రగ్స్ , మత్తు పదార్థాల జోలికి వెళ్ళోద్దని మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన సైబర్ క్రైమ్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకు మూడు, నాలుగు చోట్ల సైబర్ క్రైమ్ మోసాలు జరుగుతున్నాయన్నారు. లింక్స్, ఓటీపీ, ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ వంటి పలు సైబర్ మోసాలకు గురవుతున్నట్టు చెప్పారు. వచ్చిన లింక్స్ గానీ ఓటీపీకి గానీ స్పందించొద్దన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులతో పాటు తెలిసిన వాళ్ల అందరికీ ఇలాంటి మోసాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే, ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవల అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఉపాద్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

ఫ్యాక్టరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, అమ్మకానికి సిద్ధంగా ఉన్న గెలలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీ, అన్ని వసతులతో కూడిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని నర్మెటలో నిర్మించడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడమే కాదని రిఫైనరీని పెట్టి ఫైనల్ ప్రొడక్ట్‌ను ఇక్కడ నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే జూన్ వరకు రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ అభివృద్ధి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట/కొండపాక

చదువుతో పాటు క్రీడలు, నైతిక విలువలు కూడా ఉంటాయని, వాటితోనే విద్యార్థి సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో విద్యాశాఖ కార్యాలయంలో బాక్సింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన కొండపాక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆయన అభినందించారు. వరంగల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికై రజత పథకాన్ని సాధించడంతోపాటు, జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు అశ్విని, అఖిల, గౌతమిలతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్, రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు సంపూర్ణ వికాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలు విద్యార్థుల ఏకాగ్రతను పెంపొందించడం ద్వారా చదువులో ముందు ఉండడానికి దోహద పడతాయన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి విద్యాశాఖ ఎస్‌జీఎఫ్ ద్వారా గత నెలరోజులుగా అనేక క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్, సిద్దిపేట జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. సిద్దిపేట జిల్లా విద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, ఎస్ఓ రామస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు రఘువర్ధన్ రెడ్డి, హారతి, రామస్వామి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాలమల్లయ్య, సత్యలక్ష్మి, శ్రీలత ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను అభినందించారు.

నిరాధారాలతో తప్పుడు కేసులు





నవతెలంగాణ-సిద్దిపేట

తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు పెట్టి మాజీ మంత్రి హరీశ్‌రావుని జైల్లో పెట్టాలని చూస్తే సీఎం రేవంత్ రెడ్డికి, చక్రధర్ గౌడ్‌కి తగిన శాస్తి జరగక తప్పదని చిన్నకోడూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షులు కాముని శ్రీనివాస్ అన్నారు.బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పూటకో పార్టీ మారి, వేషాలు వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చక్రధర్ గౌడ్‌లు చేస్తున్న ఆరోపణలు ప్రజలు నమ్మరన్నారు. ప్రజల మనసును చూరగొన్న హరీశ్‌రావు గురించి ప్రజలకు తెలుసన్నారు. చక్రధర్ గౌడ్ వికిలి చేష్టలు మానుకోకుంటే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరా జ్, పీఏసీఎస్ చైర్మెన్ ములకల కనకరాజు, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షులు ఇట్టమేన శ్రీనివాస్, యువ నాయకులు గుజ్జ రాజులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల పక్షన ప్రజా గొంతుక నిలిచిన సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావుపై రీ కేసును ఓపెనింగ్ చేయడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ గత జూన్‌లో హరీశ్‌రావు పై కేసు పెట్టి నవంబర్ 19న విత్ డ్రా చేసుకున్నారని గుర్తు చేశారు. కేసును సీఎం రేవంత్ రెడ్డి రీ ఓపెనింగ్ చేయిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం మాట్లాడకుండా నోరు మూయించేందుకు అక్రమ కేసుల్లో ఇరికించాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయినా అక్రమ కేసులకు భయపడేది లేదని సీఎం వక్రబుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. పంజాగుట్ట పోలీస్టేషన్లో కేసు నమోదు చేయించడం విడ్డూరం అన్నారు. ఏడాది కాలం కింద అధికారం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేత హరీశ్‌రావుపై సీఎం అక్కస్సు పెంచుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జాకీర్, కౌన్సిలర్ చందు, పార్టీ నాయకులు మధు, మల్లేశం, దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కళ్యాణ్కర్ శ్రీనివాస్, భూపాల్ రెడ్డి, కనకయ్య, నవాజ్ మీరా, నరసింహ చారి, ఉమర్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం

- సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

ఈ సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు సొసైటీ ద్వారా 5 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సొసైటీ చైర్మెన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి తెలిపారు. బుధవారం నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు దాదాపు ధాన్యం సేకరించడం చివరి దశకు చేరుకుందన్నారు. రాంపూర్ 138 మంది రైతులు 5680. 4, లింగంపేట 114 మంది రైతులు 4603. 20, కాన్గల్ 92 మంది రైతులు 4841. 20, గుడికందుల 114 మంది రైతులు 4458, పెద్ద మాసంపల్లి 144 మంది రైతులు 4973. 6 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. మొత్తం 602 రైతుల నుండి 24,556 క్వింటాళ్ల ధాన్యం సేకరంచి రైస్ మిల్లులు తరలిం చామన్నారు. ధాన్యం సేకరించిన 4 రోజుల్లో రైతు బ్యాంకు ఖాతా డబ్బులు జమ అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ఉన్న ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటి వరకు ధాన్యం విక్రయించని రైతులు అరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదన్నారు.

విద్యా విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే

- జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి
- సిద్దిపేట జిల్లా వైద్యాధికారి విస్తృత పర్యటన



నవతెలంగాణ-జగదేవపూర్

పాఠశాలల్లో విద్యాపరమైన నాణ్యతతో పాటు విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలోనూ రాజీపడేది లేదని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జగదేవపూర్ మండలంలో విస్తృతంగ పర్యటించి పలు పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పరఖ్ విద్యాసర్వే పరీక్షకు సంబంధించిన కేంద్రాలైన ప్రాథమికోన్నత పాఠశాల దౌలాపూర్ ప్రాథమిక పాఠశాల మాంధాపూర్‌లతో పాటు ప్రాథమిక పాఠశాల తీగుల్, కొండాపూర్, బిజి వెంకటాపూర్, బచ్చులగూడ, జగదేవపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో దాదాపుగా ఖాళీలను పూర్తిచేసినందున ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరాఖ్ విద్యా సర్వేలో మంచి ఫలితాలను ఆశిస్తున్నామన్నారు. సందర్శించిన అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలును పరిశీలించి ఉపాధ్యాయులకు , మధ్యాహ్న భోజన కార్మికులకు సూచనలు చేశారు. తీగుల్, పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. సందర్శనలో జిల్లా విద్యాధికారి వెంట మండల విద్యాధికారి ఎం.మాధవ రెడ్డి , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి. సైదులు పాల్గొన్నారు.

జాతీయ రోడ్ సైక్లింగ్ పోటీలకు వెళ్లిన సిద్దిపేట విద్యార్థులు

నవతెలంగాణ-సిద్దిపేట

29వ జాతీయ స్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు సిద్దిపేటలో ఇండియా సైక్లింగ్ సెంటర్ నుంచి విద్యార్థులు వెళ్తున్నట్లు కోచ్ సంజీవ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 29వ జాతీయస్థాయి రోడ్ సైక్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఈనెల 7 నుండి 10 వరకు జరగనున్నాయని, తమ సెంటర్ నుంచి క్రీడాకారులు రిజ్వానా బేగం, ఎం లిఖిత, స్నేహ, సౌందర్య, అభి శ్రేయ రెడ్డి, తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారని తెలిపారు. డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ జయదేవార్య, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు జంగంపల్లి వెంకన్న, శ్రీనివాసులు, రాష్ట్ర సైకిల్ అసోసియేషన్ కార్యదర్శులు విజయ కాంతారావు, మల్లారెడ్డి, కోచ్ దత్తాత్రేయ, విజయ భాస్కర్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

-గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. బుధవారం మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. వాహనదారుడు కోల్పోతున్నారన్నారు. గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందికి, బ్రీత్ ఎనలైజర్ తో నిర్ధారణ చేసి రూ.17 వేల జరిమానా విధించిందిచమన్నారు. సిబ్బందితో గత కొన్ని రోజుల గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ నిర్వహించమన్నారు. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపరచగా విచారణ చేసి జరిమాన విధించారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో భవిష్యత్తుకు ముప్పే..

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గుగ్గిల్ల, పోతారం గ్రామ శివారుల్లో నిర్మితమవుతున్న ఇథనాల్ పరిశ్రమలతో మండలంతో పాటు పరిసర మండలేతర ప్రాంతాల భవిష్యత్తుకు ముప్పేనని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కనగండ్ల తిరుపతి బుధవారం హెచ్చరించారు. ఇథానాల్ పరిశ్రమల వ్యర్థాల వల్ల మండలంలోని తోటపల్లి ఆన్ లైన్ రిజర్వాయర్, శనిగరం,గౌరవెల్లి,ఎల్ఎండీ జలాశయాల్లోని నీరు, పర్యావరణం, సాగు భూములు కలుషితమై ప్రజల జీవనం చిన్నభిన్నమవుతుందని పరిశ్రమల నిర్మాణాలను తక్షణమే ప్రభుత్వం నిలుపుదల చేసి అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని తిరుపతి డిమాండ్ చేశారు.భవిష్యత్తు తరాల దృష్ట్యా దిలావర్ పూర్ రైతులను పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని మండలంలోని రైతాంగం ఉద్యమ పోరాటాలకు సిద్ధమవ్వాలని తిరుపతి పిలుపునిచ్చారు.

జిల్లాలో సీఎంఓఎస్ఎస్ కొరకు దరఖాస్తులు ఆహ్వానం

-జిల్లా మైనార్టీ శాఖ అధికారి షేక్ అహ్మద్

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మైనార్టీ శాఖ నుంచి బుధవారం జిల్లా మైనార్టీ శాఖ అధికారి, షేక్ అహ్మద్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు, జిల్లాలోని మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులు చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం(సీఎం ఓఎస్ఎస్) కొరకు అర్హత గల మైనారిటీ విద్యార్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు,పార్శీలు) నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అమెరికా, కెనెడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్ మరియు న్యూజిలాండ్ దేశాలలోని విశ్వవిద్యాలయాల్లో ఫాల్ సీజన్ ఆగష్టు 2024 నుంచి డిసెంబర్ 2024 వరకు అడ్మిషన్ పొందిన వారు అర్హులు. ఆసక్తిగల మైనారిటీ విద్యార్థులు తేదీఈ నెల 31 సాయంత్రము 5 గంటల లోపు చేసుకొవాలన్నారు. దరఖాస్తు చేసుకొన్న హార్డ్ కాపీలు జనవరి 10 లోపు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయం సిద్దిపేటలో సమర్పించాలన్నారు.

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచాలి

నవతెలంగాణ-కొండపాక



ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస సామర్థ్యాలు పెంపొందించాలని కుకునూరు పల్లి ఎంఈఓ బి సత్తయ్య తెలిపారు. మండలంలోని మాత్‌పల్లి కాశీ నగర్ తదితర ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి పలు సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందివాలని నిర్వాహకులకు తెలిపారు. మాత్పల్లి పాఠశాల ఉపాధ్యాయుడు రాజనర్సింహ విద్యార్థులకు అవసరమయ్యే చిత్రాలను వేస్తూ అవగాహన కల్పించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు, సీఆర్పీ సంతోష్ తదితరులున్నారు.

ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా పబ్బ మాధవి

నవతెలంగాణ-దౌల్తాబాద్



ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలుగా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పబ్బ మాధవిని నియమించినట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, మాడిశెట్టి హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యత, బలోపేతం చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి నియామకానికి సహకరించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా మాజీ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగ మూర్తి మహాసభ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

హరీశ్ రావుపై కేసు వేయడం హాస్యాస్పదం

నవతెలంగాణ-చేర్యాల



ఉద్యమ నాయకులు, మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పై చక్రధర్ గౌడ్ కేసు వేయడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చక్రధర్ దొంగ నోట్లు వేసి జైలు జీవితం గడిపిన వ్యక్తి అని, ఉద్యోగాల పేరుతో సుమారు 6 వేల మంది నిరుద్యోగులను మోసం చేశాడని ఆరోపించారు. సమాజంలో మంచి మనిషి అని ముసుగు వేసుకొని తిరుగుతున్న వ్యక్తి నేడు హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

గర్భిణీలకు సీమంతం కానుకలు అందజేత

నవతెలంగాణ -దుబ్బాక



అక్బర్ పేట-భూంపల్లి మండల పరిధిలోని బొప్పాపూర్, నగరం గ్రామాలకు చెందిన పలువురు గర్భిణీలకు చీర, సారెలతో పాటు న్యూట్రీషన్ కిట్లను(సీమంతం కానుకలను) కార్తీక పౌండేషన్ వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ బుధవారం అందజేశారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ బండమీది బాలమని మల్లయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సిద్ధిరాములు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు కమలాకర్ రావు, తిరుపతి గౌడ్, కామోజీ అనురాధ, మురళి గౌడ్, మంగలి స్వామి, దుబ్బరాజం, సల్వాజి రాజు పలువురున్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా దాము గెలుపు

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పాండ్రాల విజయం సాధించారు. మొత్తం 1483 ఓట్లు పోలవ్వగా 821 ఓట్లు పాండ్రాల దాము, చొక్కం గణేష్ 360, నకీర్తి మునిరాజు 289ఓట్లు సాధించారు. 461 ఓట్ల మెజారిటీతో దాము ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా విజయానికి యూత్ కాంగ్రెస్ నాయకులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పాలనలో యూత్ కాంగ్రెస్ తరపున ప్రజలకు మరిన్ని సేవలు చేస్తానని తెలిపారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలి

-రెవిన్యూ మంత్రి పొంగులేటికి జేఏసీ నాయకుల వినతి




నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జనగామ డీసీసీ అధ్యక్షులు, నియో జకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేర్యాల ఔనత్యాన్ని గత రాజకీయ భౌగోళిక సామాజిక ఉద్యమ చరిత్ర గురించి నాయకులు మంత్రికి వివరించారు. డివిజన్ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి పది రోజుల్లో సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. జేఏసీ చైర్మెన్ రామగళ్ల పరమేశ్వర్, పుర్మ ఆగంరెడ్డి, గిరి కొండల్ రెడ్డి, అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో నర్సారెడ్డి వర్గం విజయం

నవతెలంగాణ-మర్కుక్



యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నిలబెట్టిన అభ్యర్థులు జిల్లాలో, మండలాల్లో విజయం సాధించారని కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మర్కుక్‌లో మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన తూంకుంట అంక్షారెడ్డికి, మండల ,నియోజకవర్గ, జిల్లా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ముసుగులో.. నామినేటేడ్ పాకులాట..

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల రెవెన్యూ డివిజన్ ముసుగులో కాంగ్రెస్ నాయకులు నామినేటేడ్ పదవుల కోసం పాకులాడుతున్నారని సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. ఆ పార్టీ చేర్యాల ప్రాంత జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్సుల సమావేశం బుధవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా వెంటనే ప్రకటించాలని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకుండా ప్రభుత్వం, స్థానిక కాంగ్రెస్ నాయకులు లోపాయి కారీగా ఏకమై అధికార కాంగ్రెస్ పార్టీ జేఏసీ పేరుతో కాలయాపన చేయడానికి, నామినేటేడ్ పదవులను పొందడానికే పాకులాడు తున్నారు తప్పా రెవెన్యూ డివిజన్ సాధన కోసం కాదనివారు వ్యవహరించే తీరు చూస్తే అర్థమౌతుందని, దీనిని చేర్యాల ప్రాంత ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రాంత ప్రజల ఆకాంక్ష ను నీరుగార్చే విధంగా అధికార కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని ఎన్నికలలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానాన్ని మరిచిపోయి వ్యవహరించడం సరైంది కాదన్నారు. రెవెన్యూ డివిజన్ సాధించే అంశంలో తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తమ పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రతిపక్ష పార్టీలు కలిసి రావాలని, పైరవీలతో రెవెన్యూ డివిజన్ ఎప్పుడు సాధించుకోలేమన్నారు. ఇందుకు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో ఉమ్మడి పోరాటమే మార్గమని, ఈ పోరాటాల్లో ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు, ప్రజాసంఘాలు, చేర్యాల ప్రాంత మేధావులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బద్దిపడిగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల పార్టీ కార్యదర్సులు బండ కింది అరుణ్ కుమార్, తాడూరు రవీందర్, పాల్గొన్నారు.

బెజ్జంకిలో భూకంప అనవాళ్లు ..

-ఉదయం 7.27 గం.లకు భూకంపం..?

నవతెలంగాణ-బెజ్జంకి



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో భూ కంపనల అనవాళ్లు బుధవారం బయల్ప డ్డాయి. ఉదయం 7.27 గం.ని సమయంలో సెకను పాటు భూ కంపించినట్టు స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని ఓ వ్యాపారి తన దుకాణం ఆవరణం వద్ద కూర్చుండగా పైకప్పు పెచ్చులూడి పడడంతో ఉలుక్కిపడ్డాడు. దీంతో భూ కంపించినట్టు తెలిపారు.

శిథిలావస్థ ఇళ్లను గుర్తించి తొలగించాలి ..

ప్రకృతి విపత్తుల దృష్ట్యా ప్రమాద సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా మండలంలో శిథిలావస్థలోకి చేరిన ఇళ్లను అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల కేంద్రంలోని నిర్మించిన భూ అంతర్గత ఇళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించి తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు.

జీవవైవిధ్యం కోసం వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యం

- అడవులకు నిప్పుతో పర్యావరణానికి ముప్పు
- ప్రజా పాలన విజయోత్సవ సంబురాల్లో అటవీ రేంజ్ అధికారి వినాయక్

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



జీవవైవిధ్యం కోసం వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్ పేర్కొన్నారు. బుధవారం ప్రజా పాలన సంబురాల్లో భాగంగా కోమటిబండ, రంగంపేట, మైలారం, గ్రామాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించమన్నారు. పర్యావరణానికి ముప్పుగా పరిణమించే అడవులకు నిప్పు పెట్టవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా జంతు, వృక్ష జాలం సంరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని తెలిపారు. దీర్ఘకాలిక లక్ష్యంతో ప్రాథమిక దశ నుండే విద్యార్థులను వన్యప్రాణుల సంరక్షణపై చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అక్రమార్కుల ఫలితంగా జంతువులు, వన్యప్రాణులు, వృక్షాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ అక్రమార్కుల దృష్ట్యా కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని చెప్పారు. వాటికి నష్టం జరిగితే మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. వాతావరణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటడం తోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టాలని వివరించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో వన్యప్రాణులను సంరక్షించాలని కోరారు. అడవులను కాపాడాలని, అడవులకు నిప్పు పెట్టవద్దని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సెక్షన్ అధికారులు పవన్ కుమార్, బాలేశం, సిబ్బంది రాజు, స్వామి, కిషోర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పసి హృదయాల సంరక్షణకు సంజీవని

- మరో 9 ఆపరేషన్లు విజయవంతం
- ఫెర్నాండెజ్ ఆసుపత్రితో సేవల కోసం ఒప్పందం
- సత్యసాయి చైల్డ్ హార్ట్ కేర్ సెంటర్ చైర్మెన్

నవతెలంగాణ-కొండపాక



గుండె వ్యాధితో బాధపడుతున్న పిల్లలను సంరక్షించి భావితరానికి అందించడానికి సత్యసాయి సంజీవని ఆస్పత్రి కృషి చేస్తుందని ఆస్పత్రి చైర్మెన్ సి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆస్పత్రిలో హైదరాబాద్ కు చెందిన ఫెర్నాండెజ్ ఆసుపత్రి సంస్థల ప్రతినిధులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సత్య సాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఉన్న సంజీవని మాత శిశు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది శిక్షణ విషయంలో ఫర్నాండేజ్ ఆసుపత్రి వర్గాలతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. చిన్నపిల్లలకు పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత వ్యాధుల నివారణ కోసం గర్భిణీలకు మిడ్ వైఫరీ సమయంలో తీసుకోవలసిన చర్యల విషయంలో సిబ్బందికి శిక్షణ తీసుకోనున్నారు. సర్జరీ లేకుండా నార్మల్ డెలివరీ చేయడం కోసం వారి సహకారం సంజీవని ఆసుపత్రి వారు దీని ద్వారా పొందనున్నారు. కొండపాక లోని సత్యసాయి చైల్డ్ హార్ట్ కేర్ సెంటర్‌లో అందుతున్న సేవలను ఫర్నాండేజ్ ఆస్పత్రి ప్రతినిధులు ఏవిటా ఫర్నాండేజ్, డాక్టర్లు రాధారెడ్డి, శ్రీధర్ పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా సంజీవని చైల్డ్ కేర్ ఆసుపత్రి చైర్మెన్ వారికి పలు అంశాలను చూపించారు.

మరో 9 ఆపరేషన్‌లు విజయవంతం

నవంబర్ 30 వరకు ఆరు రోజుల్లో 18 ఆపరేషన్లు విజయవంతం అయిన తర్వాత మరో 9 మంది పిల్లలకు ఆపరేషన్లు చేశారు. వారికి సర్టిఫికెట్ తో పాటు బహుమతి ఈ సందర్భంగా అందజేశారు. బీహార్, ఛత్తీస్‌ఘడ్, నల్గొండ ప్రాంతాలకు చెందిన 9 మంది పిల్లలకు ఆపరేషన్లు విజయవంతం కావడంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు. సందర్భంగా వారు తల్లిదండ్రులు సత్యసాయి సంస్థలను కొనియాడారు. జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ పిల్లలు దేశ సేవ చేసే విధంగా ఆ భగవంతుడు ఆరోగ్యం ఇవ్వాలని సందర్భంగా చైర్మెన్ శ్రీనివాస్ పేర్కొన్నాడు. కార్యక్రమంలో వైద్యులు అనఘ తులసి, డాక్టర్ భూషణ్, అమిత శర్మ జగన్నాథ శర్మ గణేష్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) మండల నాయకులు తేలు ఇస్తారి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



అయినాపూర్ గ్రామపంచాయతీ అవినీతిపై చర్యలు తీసుకోవాలని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సీపీఐ(ఎం) మండల నాయకులు తేలు ఇస్తారి అడ్మినిస్ట్రేషన్ జిల్లా అధికారి ఏ.ఆర్. రెహమాన్‌కు వినతి పత్రం ఇచ్చినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.5.లక్షల వరకు అవినీతి జరిగిందని వెంటనే విచారణ చేయించాలని డిమాండ్ చేసినారు. ఒక బుక్కు కార్యదర్శి పర్సనల్‌గా, రసీదు బుక్కు తయారుచేసి బిల్లులు వసూలు చేస్తున్నాడు. గ్రామ కార్యదర్శి తప్పుడు లెక్కలు చూపిస్తూ గ్రామపంచాయతీ ఆదాయం చూపిస్తున్నాడు. గ్రామంలో డబ్బులు విచ్చలవిడిగా ఇష్టం వచ్చినట్టు పన్నులు వసూలు చేస్తూ వాడుకుంటూ గ్రామపంచాయతీకి ఏగనామం పెడుతూ డబ్బులు స్వాహా చేస్తున్నారు. గ్రామానికి పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శిని నియమించి అవినీతి విచారణ చేసి మా గ్రామ ప్రజలకు న్యాయం చేయాలన్నారు. గ్రామ ప్రజలను ఏకం చేసి కలెక్టరు ఆఫీస్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించినారు.

దివ్యాంగ బాలలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-దుబ్బాక



ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాలలకు అన్ని రంగాల్లో అవకాశాలు ఉంటాయని, పట్టుదలతో చదువుకొని పురోభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ వేలేటి భాస్కర శర్మ ఆకాంక్షించారు."విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం" సందర్భంగా బుధవారం దుబ్బాక పట్టణంలో మానవ వనరుల కేంద్రంలో 'మన భవిత సెంటర్' ద్వారా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఎంపీడీవో భాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చదువుకు అంగవైకల్యం అడ్డు రాదని.. దాన్ని దూరం చేసేలా ఉపాధ్యాయులు విద్యను నేర్పించాలని సూచించారు. ఇలాంటి విద్యార్థులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహ కాలను అందిస్తూ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఎంఈఓ జోగు ప్రభుదాస్‌తో కలిసి విద్యార్థులకు బహుమతులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేందర్ రెడ్డి, ఐఈఆర్పీలు ఎస్.రమా, యాదగిరి, సిబ్బంది గణేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మద్దూరు పోలీసులు దాడులు చేయడంతో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ముగ్గురు పరారైనట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోర్నాల గ్రామ శివారులో, 8 మంది పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో సిద్దిపేట టాస్క్ ఫోర్స్ మద్దూరు పోలీసులు కలిసి దాడులు చేయడంతో పేకాట ఆడుతూ ఐదుగురు పట్టు పడ్డారని మిగతా ముగ్గురు పరారైనట్లు ఆయన తెలిపారు. దాడుల్లో రూ.4780లు, 06 మొబైల్ ఫోన్లు, 6 మోటార్ సైకిల్, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో , పట్టణాల్లో ఫామ్ హౌస్‌ల్లో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు.

సేంద్రీయ కూరగాయల సాగును పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం బందారం గ్రామంలో రాజిరెడ్డి అనే రైతు సేంద్రీయంతో పండిస్తున్న కూరగాయల సాగును రాష్ట్ర అధికారుల బృందం బుధవారం సాయంత్రం సందర్శించారు. సెరికల్చర్ ఉద్యానవన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, జిల్లా కలెక్టర్ ఎన్ మను చౌదరితో పాటు పలు శాఖల అధికారులు పందిరి సాగును పరిశీలించారు. రైతు అమ్మన రాజిరెడ్డి సుమారు 35 ఎకరాల్లో సేంద్రీయంతో బీర కాకర పంటలు పండిస్తున్నాడు. రైతుతో అధికారులు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు పంటల దిగుబడి ఎగుమతి తదితర అంశాలను తెలుసుకున్నారు. హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి, , జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, టీజీ ఆయిల్ ఫెడ్ జనరల్ మేనెజర్ సుధాకర్ రెడ్డి, ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి అధికారులు ఉన్నారు. జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి నిమ్మ ఇంద్రసేనారెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- రాయపోల్

పశు సంపద అభివృద్ధి కోసం ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ నిఖిల అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం మహమ్మద్ షాపూర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక శాఖ వారు సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పశుగణాభివృద్ధి చేయడం కోసం పశువుల ఆరోగ్యంగా ఉండటం కోసం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ శిబిరాల్లో తమ పశువులకు ఎలాంటి జబ్బులు ఉన్న చికిత్స జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 26 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 3 పశువులకు గర్భధారణ ఇంజక్షన్లు, 2 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు,18 పశువులకు సాధారణ చికిత్సలు, 32 దూడలకు నట్టల నివారణ మందులు అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో విప రాజిరెడ్డి, ఓఎస్ స్వామి, గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్ గౌడ్, గోపాలమిత్రాలు స్వామి, హర్షద్, పాడి రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు వాటర్ ఫిల్టర్, టీవీ అందజేత

నవతెలంగాణ-నంగునూరు



మండలం తిమ్మాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు కీర్తిశేషులు చల్లారం బాలవ్వ జ్ఞాపకార్థం వారి కుమారులు చల్లారం పద్మా రెడ్డి, చల్లారం సుధాకర్ రెడ్డి వాటర్ ఫిల్టర్, ఎల్ఈడి టీవీ, పిల్లలకు వాటర్ బాటిల్స్ దాదాపు రూ.50 వేల విలువగల మెటీరియల్ అందించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో దేశిరెడ్డి హాజరై దాత చల్లారం రమ్య-సుధాకర్ రెడ్డి పాల్గొని మెటీరియల్ అందజేశారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద పిల్లలు చదువుకోంటారని చెప్పారు. సరైన సదుపాయాలు లేకపోవడం వాళ్ళ ఇబ్బంది దృష్ట్యా మా అమ్మ బాలవ్వ జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకి ఈ సహకారం అందించామన్నారు. రాబోయే రోజుల్లో ఈ పాఠశాలకు ఏ అవసరం ఉన్న నా వంతు సహకారం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశాంత్ కుమార్, ఉపాధ్యాయ బృందం ఎస్ఎంసి చైర్మెన్ మాజీ సర్పంచ్ నర్సింలు, రెడ్డి సంఘ అధ్యక్షులు చల్లారం రాజశేఖర్ రెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ స్పెషల్ కమిటీ

- అధ్యక్షుడిగా హరీష్, కార్యదర్శిగా జైపాల్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ యూనిట్ ఎన్నికలు బుధవారం జరిగాయి. జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏం.హరీష్, జిల్లా కార్యద ర్శిగా జైపాల్ రెడ్డిలు ఎన్నిక య్యారు. ఎలక్షన్ అధికారులుగా అజీమ్, నిమ్మ సురేం దర్ రెడ్డి లు వ్యవహరించారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్జీవో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో టీఎన్జీవో సిద్దిపేట జిల్లా కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి, సర్వెంట్ ల్యాండ్ రికార్డ్స్ కరీంనగర్ మాజీ అధ్యక్షులు సేవియా నాయక్, కలెక్టరేట్ యూనిట్ కార్యదర్శి నగేష్, సహాధ్యక్షులు సుమన్, కోశాధికారి సాయి, మహిళా సంయుక్త కార్యదర్శి ప్రియాంక, జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ శ్రీకాంత్, జిల్లా సర్వే అధికారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా పవన్

నవతెలంగాణ-నంగునూరు



యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రటరీగా సాదుల పవన్ కుమార్ నియమితు లయ్యారు. బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో పోటీ గెలుపొందారు. నంగునూరు మాజీ సర్పంచ్ సాధుల రాణి - ఆత్మరాములు కుమారుడు పవన్ కుమార్ ఇదివరకే చాలా పదవుల్లో కొనసాగారు. జిల్లా జనరల్ సెక్రటరీగా నియామకం అయినందుకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

మండల యువజన ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్

నవతెలంగాణ-బెజ్జంకి



మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన బోయిని ప్రశాంత్ బుధవారం ఎన్నిక య్యారు. ప్రశాంత్ ఎన్నికవ్వడంపై మండలంలోని కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన అధికారులు

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని హనుమతాండాలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో. ఆ గ్రామంలో ప్రభుత్వ భూమి లేనందున కూటిగల్ గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసినట్లు హుస్నాబాద్ డీఈ కృష్ణయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థల పరిశీలన కోసం వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట చేర్యాల ఏడి వెంకట్ గౌడ్, దూల్మిట్ట ఏఈ రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ళ పంపిణీ

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఐదు సైకిల్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ చైర్మెన్ గౌరిట్యాల వెంకటకిషన్, ప్యాక్స్ చైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని మంచి పేరు సంపాదించాలని సూచించారు. గతంలో వాటర్ ఫిల్టర్ అందజేశారని అలాగే ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ మహమూద్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ ముంజ మంజుల, నాయకులు నాగరాజు, ఉపాధ్యాయులు ఓదేలు, రవీందర్, పాల్గొన్నారు



నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా శానగొండ శరత్



నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి చెందిన శానగొండ శరత్ బుధవారం ఎన్నికయ్యారు. శరత్ ఎన్నికవ్వడంపై మండలంలోని కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలను వివరిస్తూ కళాకారుల ప్రదర్శన



నవతెలంగాణ- దుబ్బాక

డీపీఆర్ఓ బిజ్జూరి రవికు మార్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ 'సాంస్కృతిక సారథి టీమ్' కళాకారులు మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హసన్ మీరాపూర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారని టీం లీడర్ జాగోరే రవి తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ సిహెచ్ కిషన్, కళాకారులు కొమ్ము రవీందర్, ఈ.క్రాంతికుమార్, కొమ్ము ఎల్లయ్య, ముక్కపల్లి భార్గవి, ఏల్పుల తిరుమలయ్య, పిల్లుట్ల శ్యాంసుందర్, సన్వాల కనకయ్య, పిల్లిట్ల ప్రకాష్, గెంటే హరిప్రసాద్, తండ బిక్షపతి ఉన్నారు.

హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం

నవతెలంగాణ-సిద్ధిపేట



కాంగ్రెస్ మోసపూరితమైన హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన హామీలు అమలు చేయడంలో విఫలమైం దని బీజేపీ ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా కార్యదర్శి భోగి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిద్దిపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు ఏమాత్రం తేడా లేదన్నారు. గత ఏడాది కాలంగా మార్పు పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మార్పు రావాలి..కాంగ్రెస్ కావాలి అనే నినాదంతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ప్రజలను మోసం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నాయకులు దాబా నరేష్, సునీల్, వేణు, సురేష్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం

నవతెలంగాణ-సిద్ధిపేట



వాసవి క్లబ్, వాసవి క్లబ్ యూత్ ఆధ్వర్యంలో రియాన్ష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో, గడ్డం జయశ్రీ జన్మదిన సందర్భంగా మానసిక వికలాంగుల విద్యాలయంలో అన్న ప్రసాద వితరణ చేసినట్లు వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి, వాసవి క్లబ్ యూత్ అధ్యక్షులు అర్వపల్లి హరికృష్ణ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుల మతాలకతీతంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు విట్టల్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల బాట

నవతెలంగాణ-జగదేవపూర్



రాష్ట్ర బీఆర్ఎస్వీ పార్టీ పిలుపు మేరకు జగదేవపూర్ మండలంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాల, గురుకుల పాఠశాలలను బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు బుధవారం సందర్శించారు. పాఠశాలకు వెళ్లిన సందర్భంలో విద్యార్థులతో మాట్లాడగా విద్యాసంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు కాస్మోటిక్ చార్జెస్ గాని బూట్లు గాని, ఏకరూపబెడ్ దుస్తులు, బెడ్ షీట్లు ఇవ్వలేదు అన్నారు. మధ్యాహ్నం పూట సంతృప్తి భోజనం చేయట్లేదు అన్నారు. ఫ్యాన్లు గాని బాత్రూం డోర్స్ కానీ సరిగా లేవని అన్నారు. మంత్రులు గాని ఎమ్మెల్యేలు గానీ గురుకులంలో సందర్శించినట్టయితే వారి బాధలు తెలుస్తాయి. పేద విద్యార్థులు గురుకులాల్లో చదువుకుందామని పోతే భయాందోళనకు గురికావాల్సి వస్తుంది అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖను ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ , బీసీ మైనార్టీ గురుకలలో చదువుతున్న పేద విద్యార్థిలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఏర్పుల మహేష్, సాగర్, కనకయ్య, బాలకృష్ణ ,రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో పొద్దుతిరుగుడు పంటసాగు ఎంతో మేలు

- తక్కువ నీటితో పంట సాగు
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- దొమ్మాట వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్ కుమార్



నవ తెలంగాణ- దౌల్తాబాద్

పొద్దుతిరుగుడు పంట సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని, మంచి లాభాలు గడించడమే కాకుండా నీటి ఎద్దటి సమస్య లేకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని దొమ్మాట వ్యవసాయ విస్తరణ అధకారి సంతోష్ కుమార్ అన్నారు. పొద్దుతిరుగుడు పంట సాగు గురించి తగు సూచనలు చేశారు.పొద్దుతిరుగుడు విత్తులు విత్తే సమయం సాధారణంగా 100 నుంచి 110 రోజుల్లో తక్కువ నీటి తడులతో పంట పూర్తవుతుంది. వరి తరువాత ప్రొద్దు తిరుగుడు వేసుకునే పక్షంలో డిసెంబరు ఆఖరి వారం నుంచి జనవరి మొదటివారం వరకు విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం..

పొద్దుతిరుగుడు పంటలో ఎరువుల యాజమాన్యం ముఖ్య పాత్ర వహిస్తుంది. మంచి దిగుబడులు సాధించడానికి మొదటి దఫా విత్తిన తర్వాత నత్రజని 50 శాతం (35 కిలోల యూరియా) తరువాత రెండో దఫాగా విత్తిన 30 రోజుల తరువాత మొగ్గ తొడిగే దశలో 25 శాతం(18 కిలోల యూరియా), మూడో దఫాగా 50 రోజుల తరువాత పూవ్వు వికసించే దశలో 25 శాతం(18కిలోల యూరియా) ఒక ఎకరానికి వేసుకోవాలి. భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో 150 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. పైపాటుగా ఎరువు వేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి. గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఎకరాకు 10 కిలోల గంధకాన్ని జిప్సం రూపంలో (55 కిలోలు) ఎకరాకు వేస్తే నూనె శాతం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు. 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి చొప్పున కలిపి పైరు పూతదశలో (ఆకర్షక పత్రాలు వికసించే దశలో) ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. దీనివలన గింజలు బాగా కడుతుంది. లేదా ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 కిలోల చొప్పున బోరిక్ ఆమ్లాన్ని వేసుకోవడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చు. అంతే కాకుండా పంటలో కలుపు నివారణ, భూసారవంతం గురించి సవివిరంగా చెప్పారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-గజ్వేల్

విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం పిలుపునిచ్చారు. కళాశాల ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, వీటి వినియోగం వల్ల యువత నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి కడుపు కోత తీరని నష్టం కలిగించకుండా ఉండాలంటే, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. తదనంతరం డ్రగ్ ఫ్రీ గోడ పత్రికను కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.గణపతి రావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటేష్, అధ్యాపకులు డాక్టర్ డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్



విజయభాస్కర్ రెడ్డి,ఎస్. మహేందర్, పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగడానికి గ్రంథాలయాలు దోహదం

నవతెలంగాణ-చేర్యాల

బాలలకు మార్గదర్శనం చేస్తూ, నైతిక విలువలను నేర్పిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపకరిస్తాయని ప్రధానోపాధ్యాయులు పి. ఎన్. చంద్రశేఖర్ రావు అన్నారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని వినియోగించుకోవడానికి దాతలు పుస్తకాలను అందించి సహకరించాలని కోరారు. బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ రచించిన పుస్తకాలు, ఇతర విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, కృష్ణమూర్తి, రామకృష్ణ, లింగయ్య, కాంతికృష్ణ, మమత, అరుణ, సాజిదా, ప్రీతి, సీఆర్పీ రవీందర్, దినేష్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం బందారం గ్రామంలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 32 మంది గర్భిణీలకు బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిద్దిపేట జిల్లా డీడబ్ల్యూఓ శారద , చేర్యాల ప్రాజెక్టు సీడీపీఓ రమాదేవి, క్లబ్ గవర్నర్ బాలచందర్‌లు పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్నపిల్లలకు అన్నప్రాస, అక్షరభ్యాసం నిర్వహిం చారు. బందారం, అంకిరెడ్డిపల్లి,



తిమ్మాయిపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన గర్భిణీలు మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ మల్టిపు ల్ జాయింట్ పీఆర్ఓ సోమ వనజ, ఐసీసీ కమిటీ మెంబర్ బెజుగామ ఆత్మ రాములు, పెద్ది వైకుంఠం, సోమ శివకుమార్, పెద్ది రామచంద్రం, క్లబ్బు సభ్యులు గొల్లపల్లి మధుసూదన్ రెడ్డి, కొండ వెంకటేశం, క్యాబినెట్ కార్యదర్శి గంద ఈశ్వర్ చరణ్, మాజీ సర్పంచ్ గజ్వేల్ రజిత కరుణాకర్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పి.రజిత, సిహెచ్ అండాల్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేస్తే సహించేది లేదు

నవతెలంగాణ-దుబ్బాక

పేదలకు కనీస పని దినాలను కల్పిస్తూ.. వారికి ఆర్థిక భరోసా నిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేస్తే సహించేది లేదని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ హెచ్చరించారు. బుధవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికుల కనీస హక్కులను కాలరాస్తూ.. లేబర్ కోడ్ల పేరుతో అనేక కార్మిక చట్టాలను ఎత్తివేసిందని గుర్తుచేశారు. ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది కార్మికుల పేర్లను జాబ్ కార్డు నుండి తొలగించిందని మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కల్పించే పని హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5, 6 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ ఉన్నారు.



పాఠశాలకు చేయూత



నవతెలంగాణ-చేర్యాల

మండలంలోని పోతిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలకు బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. ఫౌండేషన్ సభ్యులు పి.అనిల్ స్పోర్ట్స్ డ్రెస్సులను, బోయిన స్వామి స్కూల్ షూలను, జింకల మోహన్ టై బెల్ట్ ఐడి కార్డులను, జింకల పర్వతాలు యాదవ్ ప్రహరీ గోడకు రంగులు వేసి బొమ్మలు వేయించి వారి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు దొంగల ఐల్ రెడ్డి విద్యార్థులకు డైరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లక్ష్మి, ఈ సందర్భంగా జయశంకర్ ఫౌండేషన్ సభ్యులను, డైరీలను అందజేసిన ఉపాధ్యాయుడు అయిల్ రెడ్డిని పలువురు అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్రోళ్ల విజయ్ కుమార్, ఈగ ఆంజనేయులు తోపాటు మాజీ సర్పంచులు, ఎంపిటీసీలు, ఎస్ఎంసీ చైర్మెన్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరజిత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

-రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వరజిత్ అనే వ్యక్తి మృతి చెందారు. బుధవారం జరిగిన ఈ సంఘటనలో మృతుడు స్వస్థలం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా తొండి చౌడి గ్రామం. గజ్వేల్ పట్టణానికి 12 ఏండ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చారు. మృతునికి భార్య ,ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని సీపీఐ(ఎం) నాయకులు ఎల్లయ్య కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మరాఠీ కృష్ణమూర్తిలు పరామర్శించి వారు మాట్లాడుతూ వరజిత్ అనే చిరు వ్యాపారి గప్ చుప్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారికి రూ.10 లక్షలు చెల్లించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. విద్యుత్ అధికారులు కూడా వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

వెంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సిద్ధిపేట

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవం వేడుకల్లో భాగంగా బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వారి ఉత్తర్వుల మేరకు సిద్దిపేటలోని మోహినిపుర వీధిలో వెలసిన శ్రీ పద్మావతి సహితఅలివేలు మంగ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించినట్లు కార్యనిర్వాణా అధికారి విశ్వనాథ్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ రమేష్ విష్ణు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



నవతెలంగాణ-కౌడిపల్లి

నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ నాయకులు చిలుముల దుర్గారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కౌడిపల్లిలో జోగిపేట రాజుకు రూ.52,500ల చెక్కును ఆయన అందజేశారు గత కొన్ని రోజుల క్రితం రాజుకు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది లక్షల రూపాయలు ఖర్చు చేశారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.52,500 చెక్కు రావడంతో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోల నవీన్, సందీప్, ప్రతాప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై అక్రమ కేసులు సిగ్గుచేటు



నవతెలంగాణ-గజ్వేల్ : అక్రమ కేసులు ఉన్న చక్రధర్ గౌడ్‌తో హరీశ్‌రావు పై కేసులు పెట్టించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ కొండపాక మండలం అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హరీశ్‌రావు ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఓర్వలేక పోతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు బయటపెడుతున్న నేపథ్యంలో హరీశ్‌రావు పై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రజలకు చెందవలసిన హామీలను పక్కదారు పట్టించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగానే కేసులను రీఓపెనింగ్ చేయించినట్లు ఆయన అన్నారు. కేసులు పెట్టినంత మాత్రాన ప్రభుత్వం చేస్తున్న తప్పులను విడిచి పెట్టేది లేదని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామ్ కుమార్, ముగ్ధం, రాకేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే ఆపాలి

-ఇస్కాన్ రంగతిరుదాస్

నవతెలంగాణ-సిద్ధిపేట



బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే ఆపాలని, ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ ను జైలు నుంచి విముక్తి చేయాలని ఇస్కాన్ రంగతిరుదాస్ డిమాండ్ చేశారు. హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలందరిపై, మహిళలపై దాడులు, హత్యలు, దోపిడీలు, దహనాలు, అమానవీయ దౌర్జన్యాలు ఆపాలని కోరుతూ పాత బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శాంతియుత నిరసనల ద్వారా హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వం జైలుకు పంపడం అన్యాయమని, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే ఆపి, శ్రీ చిన్మోయ్ కృష్ణదాస్‌ను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ బలిజ సంఘం, వికాస తరంగానికి సంఘం, భగవత్ గీత్ సంఘం, వికాస తరంపరని సంఘం, బార్ అసోసియేషన్, రామచంద్ర మిషన్, వనవాస సంఘం, సుందర సంతు సంఘం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొత్తకొండ శ్రీనివాస్, జనర్ధన్ రెడ్డి, సత్య నారాయణ, కొత్తకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

సందర్శనకు వెళితే తాళం వేస్తారా...!

-బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకుల ధర్నా

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



విద్యార్థి సంఘ నాయకులు గురుకుల పాఠశాల సందర్శనకు వెళితే పరిశీలించకుండా తాళం వేస్తారా అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాం ప్రశ్నించారు. బుధవారం బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు గురుకుల సందర్శన బాట లో భాగంగా హుస్నాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలకు బీఆర్ఎస్వీ నాయకుల బృందంతో కలిసి సందర్శనకు వెళితే ప్రిన్సిపల్ అనుమతించకుండా కలెక్టర్ పర్మిషన్ ఉంటేనే లోపలికి రానిస్తామని గేటుకు తాళం వేసుకొని వెళ్లారు. దీంతో విద్యార్థి సంఘ నాయకులు గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలో సరైన సౌకర్యాలు కల్పించకుండా, పరిశీలనకు వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులను కక్షపూరితంగా అడ్డుకుంటుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు బొజ్జ హరీష్, పల్లె నవీన్, కందుకూరి సతీష్, మంకాల రమేష్,సైఫుద్దీన్, శేఖర్ బాబు, మహేష్, అజయ్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

-దౌల్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు

నవతెలంగాణ-దౌల్తాబాద్



ప్రభుత్వ హాస్టల్, పాఠశాలలలో మధ్యాహ్న భోజనం ఆహారం సౌకర్యాలు విద్య కచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని దౌల్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు అన్నారు. బుధవారం మండలం లింగరాజు పల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ మొత్తం కలియతిరిగి విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించడం జరిగిందన్నారు. స్వయంగా విద్యార్థులతో మాట్లాడి వసతులను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలను సందర్శించి వంట కార్మికులకు తగు సూచనలు చేయడం జరిగింది.ఖచ్చితంగా వంటగదిలో పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని, వంటకు తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని సూచించడం జరిగిందన్నారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. హాస్టల్ పాఠశాలను ఎలాంటి అసౌకర్యాలు ఉన్న పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న, పాఠశాల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

కొడముంజ మహేందర్‌కు ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన కోడముంజ మహేందర్‌కు ఐటీ అండ్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ లోమంత్రులు బీసీ ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా నవంబర్ 1న ఇండస్ట్రీ రంగంలో బెస్ట్ అవార్డు అందుకున్నారు. బెస్ట్ అవార్డు అందుకోవడం పై బుదవారం హుస్నాబాద్ లో కొడముంజ మహేందర్ కు ఆత్మీయ సన్మానం చేశారు. ఉత్తమ గ్రామీణ ఉత్పత్తి పరిశ్రమలో అవార్డు అందుకోవడం పై మహేందర్ అభినందించారు. భవిష్యత్తులో ఇండస్ట్రీ రంగంలో ఎంతోమందికి ఉపాధి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి హసన్, వెన్న రాజు, పోలు సంపత్. లావుడియా బిఖ్యానాయక్. గాలిపెల్లి శ్రీనివాస్, సంఘ కుమార్, బెజ్జంకి బాబు, పంపర సంపత్, మెరుగు వెంకన్న, ల్యాతాకుల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల హామీలు మోసపూరితమే..

-బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆరోపణ

-కాంగ్రెస్ హామీలపై మానకొండూర్ లో బహిరంగ సభ

నవతెలంగాణ-బెజ్జంకి



ఎన్నికల సమయంలో అధికారలోకి రావడానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రజల కిచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని, ఆరు గ్యారంటీల హామీలు మోసపూరితమేనని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు బుధవారం ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, రైతాంగ, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మానకొండూర్ మండల కేంద్రంలో బీజేపీ అధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హజరై విజయవంతం చేయాలని రాజు కోరారు.

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా జగదీశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-ములుగు : ములుగు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా అన్న సాగర్ గ్రామానికి చెందిన కుంట జగదీశ్వర్ రెడ్డి 400కు పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.యువత అన్ని రంగాల్లో ఎదుగుదలకు, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

సీఎం కప్పును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కౌడిపల్లి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడ ప్రాథమిక సంస్థ వారి ఆదేశాల మేరకు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం సీఎం కప్2024 నిర్వహిస్తుందని. కౌడిపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, డిఎస్డిఓ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సీఎం కప్‌ను మండల స్థాయిలో క్రీడా పోటీలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని పిడి, పిఈటిలతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పంచాయతీ స్థాయిలో 7వ తేదీన క్రీడలు నిర్వహించాలని, మండల మండల స్థాయి క్రీడలు తునికి ఎంజిబి స్కూల్‌లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆంజనేయులు, ఎంఈఓ బాల్ రాజు, ఎస్సైరంజిత్ రెడ్డి, ఆర్ఐ శ్రీహరి,పీడీలు పూర్ణచంద్, శేఖర్, పిఈటి లు కృష్ణ గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిలదీస్తే బెదిరిస్తారా?



నవతెలంగాణ-నిజాంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నిలదీస్తే బీజేపీ నాయకులను బెదిరిస్తున్నారని మండల అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. కాంగ్రె స్ 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ ఆధ్వర్యంలో ఛార్జ్ షీట్ విడుదల చేసి రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించడం జరిగిందని, దీన్ని ఏద్దేవా చేస్తూ గుమ్మడికాయల దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్టు మేము అభివృద్ధి గురించి మాట్లాడితే వాళ్ళు బీజేపీ జిల్లా అధ్యక్షులని, మాజీ జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్‌ని బీజేపీ కార్యకర్తలని విమర్శించడం సరికాదన్నారు. బీజేపీని విమర్శించే స్థాయి కాంగ్రెస్ వాళ్ళకి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహంకాళి నరేష్, ఉపాధ్యక్షులు బుర్ర సంతోష్ గౌడ్, పప్పుల సిద్దారంరెడ్డి, చల్మెటి నరేందర్, ప్రణయ్ కుమార్, ఎస్టి మో ర్చా అధ్యక్షులు కిషన్ నాయక్, సంజీవ్, జాల పోచ య్య, కొమ్మట అమర్,ఎల్లం, ఉడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.